ఆంధ్రజ్యోతి 5
ప్రకాశం
జిల్లా వార్తలు
సోమవారం 8, సెప్టెంబరు 2025


వల్లూరమ్మ ఆలయాన్ని మూసివేస్తున్న అధికారులు

సంపూర్ణ చంద్రగ్రహణం

జిల్లాలో దేవాలయాలు మూత

నేడు సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం


త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయం మూత వేస్తున్న అర్చకులు, అధికారులు

చంద్రగ్రహణం ప్రభావంతో జిల్లాలోని హిందూ దేవాలయాలన్నీ ఆదివారం మధ్యాహ్నం నుంచి మూతపడ్డాయి. రాత్రి 9:57 గంటలకు ప్రారంభమైన గ్రహణం తెల్లవారుజామున 2.25 గంటలకు ముగిసింది. అత్యంత అరుదుగా ఎక్కువ సేపు కనిపించిన చంద్రగ్రహణాన్ని ప్రజలు అర్ధరాత్రి వరకూ ఆసక్తిగా వీక్షించారు. జిల్లాలోని ప్రముఖమైన త్రిపురాంతకేశ్వర దేవస్థానంలోని ఉభయ ఆలయాలు, మార్కాపురంలోని చెన్నకేశవస్వామి, నెమలిగుండ్ల రంగనాయకస్వామి, మిట్టపాలెంలోని నారాయణస్వామి, భైరవకోన ఆలయం, సింగరాయకొండలోని లక్ష్మీనరసింహస్వామి, వల్లూరులోని వల్లూరమ్మ దేవస్థానాలతోపాటు అన్ని ఆలయాలనూ మూసివేశారు. సోమవారం సంప్రోక్షణ అనంతరం తెరవనున్నారు. ఉదయం 6 నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు.

-ఒంగోలు కార్పొరేషన్, ఆంధ్రజ్యోతి



సంపూర్ణ చంద్ర గ్రహణం ఇలా...

12న జిల్లాకు మంత్రి అచ్చెన్నాయుడు

పచ్చవలో ఎన్టీఆర్, దామచర్ల, రాంబొట్ల విగ్రహాల ఆవిష్కరణ

ఒంగోలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈనెల 12న జిల్లాకు రానున్నారు. కొండపి నియోజకవర్గ పరిధిలోని జరుగుమల్లి మండలం పచ్చవలో ఆ రోజు సాయంత్రం ఎన్టీఆర్, మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు, ఆ గ్రామానికి చెందిన టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు తానికొండ రాంబొట్లు విగ్రహాలను ఆవిష్కరించనున్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసే సభలో పాల్గొంటారు. ఆయనతోపాటు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, నెల్లూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ హాజరుకానున్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి భారీగా టీడీపీ శ్రేణులు పాల్గొనేలా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.



అదనపు పొగాకు కొనుగోళ్లకు గ్రీన్‌సిగ్నల్

పొగాకు అదనపు పంట కొనుగోళ్లకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పరిమితంగా అదనపు సర్వీసు చార్జీలు విధించింది. దీనివలన దక్షిణాదిలోని రైతులపై సుమారు రూ.50 కోట్ల మేర భారం పడే అవకాశం ఉంది. గత రెండేళ్లుగా పొగాకు బోర్డు అనుమతించిన దానికన్నా అధికంగా పండిన పంటపై ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా సాధారణంగా వసూలు చేసే ఒక శాతం సర్వీసు రుసుంతోనే కొనుగోలు చేశారు. ఈసారి (2024-25)లో పంట దిగుబడి భారీగా పెరగడంతో రానున్న సీజన్‌లో పంట ఉత్పత్తి నియంత్రణపై పొగాకు బోర్డు, కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖలు దృష్టి సారించాయి. రైతుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకొని పరిమితంగానైనా అదనపు సర్వీసు చార్జీలు వసూలు చేయాలని నిర్ణయించాయి.

- పరిమితంగానే సర్వీసు చార్జీ విధింపు
- 20శాతం మించితే 3శాతంతోపాటు కిలోకు రూపాయి వసూలు
- దక్షిణాది రైతులపై రూ.50 కోట్ల మేర భారం
- అనుమతి లేని పంటపై ఆరు శాతం విధింపు
- ఆగిన కేంద్రాల్లో వేలం పునఃప్రారంభం

ఒంగోలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రస్తుతం కొనుగోళ్లు జరుగుతున్న ఈ సీజన్ (2024-25)లో పొగాకు పంట ఉత్పత్తి భారీగా పెరిగింది. 167 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి బోర్డు అనుమతి ఇవ్వగా సుమారు 240 మిలియన్ కిలోల మేర పండినట్లు అంచనా. అందులో దక్షిణాదిలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఉన్న 11 వేలం కేంద్రాల పరిధిలో 105 మిలియన్ కిలోలకు అనుమతి ఇవ్వగా దాదాపు 160 మిలియన్ కిలోల మేర పంట ఉత్పత్తి అయినట్లు సమాచారం. భారీగా పంట పెరగడంతో పాటు ప్రస్తుత సీజన్‌లో ధరలు కూడా గతంలో వలే లేకున్న నేపథ్యంలో రానున్న సీజన్‌లో పంట ఉత్పత్తి నియంత్రణపై బోర్డు, కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖలు దృష్టి సారించాయి.

రైతుల అభిప్రాయాల సేకరణ

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కేంద్ర వాణిజ్య శాఖ ఉన్నతాధికారులు మూడు నెలల క్రితం పర్యటించారు. క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడారు. నెలన్నర క్రితం వాణిజ్యశాఖ మంత్రి గుంటూరులోని పొగాకు బోర్డు కార్యాలయంలో వ్యాపార, రైతు ప్రతినిధులు, అధికారులతోనూ సమీక్ష చేశారు. ఆ సందర్భంగా రైతుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకొని పరిమితంగానైనా అదనపు సర్వీసు చార్జీలు వసూలు చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. వేలం కేంద్రాల వారీగా నిర్వహించిన రైతు కమిటీల సమావేశాలలో అదనపు పంట కొనుగోళ్లపై 2నుంచి 3శాతం అదనపు సర్వీసు చార్జీల వసూలుకు రైతు ప్రతినిధులు సుముఖత వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అదనపు పంట కొనుగోళ్లపై అనుమతి కోసం నెలన్నర క్రితం బోర్డు అధికారులు వాణిజ్య మంత్రిత్వ శాఖను సంప్రదించారు.

ఆరు వేలం కేంద్రాల్లో అధికారిక కొనుగోళ్లు పూర్తి

అదనపు పంట కొనుగోలు అంశంపై చర్చలు జరుగుతున్న తరుణంలో పలు వేలం కేంద్రాలలో అధికారిక కొనుగోళ్లు పూర్తయ్యాయి. అలా దక్షిణాదిలో ఉన్న 11 వేలం కేంద్రాలలో ఆరుచోట్ల వేలం నిలిచింది. ఈ నేపథ్యంలో అదనపు పంట కొనుగోళ్లకు పరిమిత అదనపు సర్వీసు చార్జీలతో కేంద్రం అనుమతి ఇచ్చింది.

అదనపు చార్జీల వసూలు ఇలా..

కేంద్రం విధించిన అదనపు చార్జీలను పరిశీలిస్తే అనుమతించిన దాని కన్నా 10శాతం ఎక్కువ పంట వరకు ప్రస్తుతం సాధారణంగా వసూలు చేసే ఒక శాతం చార్జీ తప్ప ఎలాంటి అదనపు సర్వీసు చార్జీ వసూలు చేయరు. అదే 10నుంచి 20శాతం వరకు ఉంటే ప్రస్తుతం వసూలు చేసే ఒక శాతం సాధారణ సర్వీసు చార్జీతో పాటు అదనంగా 2శాతం, అలాగే కిలోకు ఒక రూపాయి పెనాల్టీ వసూలు చేస్తారు. 20శాతం కన్నా పైన ఉంటే 3శాతం అదనపు సర్వీసు చార్జీ, కిలోకు ఒక రూపాయి పెనాల్టీ విధించారు.

నేటి నుంచి కొనుగోళ్లు పునః ప్రారంభం

దక్షిణాదిలోని అన్ని వేలం కేంద్రాల్లో అదనపు పంట కొనుగోళ్లకు బోర్డు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే రైతులు తమ వద్ద సుమారు ఎంత మేర అదనంగా పంట ఉందన్న విషయాన్ని బోర్డు అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది. అందుకు సంబంధించిన దరఖాస్తులను సంబంధించి క్లస్టర్ ఫీల్డ్ ఆఫీసర్ల వద్ద అందజేయాలని పొగాకు బోర్డు ఆర్ఎం రామారావు తెలిపారు.

55 మిలియన్ కిలోలు అధికంగా ఉత్పత్తి

ప్రస్తుత సీజన్‌లో బోర్డు అధికారుల అంచనా ప్రకారం చూస్తే అనుమతి ఇచ్చిన దాని కన్నా సుమారు 55 మిలియన్ కిలోల పంట అధికంగా పండింది. తాజా నిర్ణయం ప్రకారం ఆ 55 మిలియన్ కిలోల పంటలో 10శాతం పోను మిగిలిన 49.50 మిలియన్ కిలోల పంటకు అదనపు చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఒక అంచనా ప్రకారం రైతులు సుమారు రూ.50 కోట్ల మేర అదనపు చార్జీలు బోర్డుకు చెల్లించాల్సి ఉంటుంది.


పరిటాల ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న ఉమ్మడి జిల్లా నేతలు

'సూపర్ హిట్' సభ ఏర్పాట్లలో ఉమ్మడి జిల్లా నేతలు

- అనంతపురంలో మంత్రి గొట్టిపాటి
- అక్కడే ఎమ్మెల్యేలు ఏలూరి, ఉగ్ర, మారిటైం బోర్డు చైర్మన్ సత్య మకాం

ఒంగోలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : అనంతపురంలో ఈనెల 10న టీడీపీ నిర్వహిస్తున్న సూపర్ సిక్స్. సూపర్ హిట్ సభ ఏర్పాట్లలో పలువురు ఉమ్మడి జిల్లా నేతలు నిమగ్నమయ్యారు. గత ఎన్నికలకు ముందు రాష్ట్రంలోని వివిధ వర్గాల సంక్షేమం కోసం టీడీపీ ఎన్నికల ప్రణాళికలో సూపర్ సిక్స్ పేరుతో పథకాలను ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత నాడు ఇచ్చిన ప్రధాన హామీలైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి కీలకమైన వాటిని అమలు చేసింది. ఈనేపథ్యంలో సూపర్ సిక్స్-సూపర్ హిట్ పేరుతో విజయోత్సవ సభను భారీగా నిర్వహించాలని టీడీపీ నిర్ణయించింది. అందుకు వేదికగా అనంతపురంను ఎంపిక చేసింది. ఈనెల 10న అక్కడ నిర్వహిస్తున్న సభకు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు తరలిరానున్నాయి. రాయలసీమ ప్రాంతంలోని దాదాపు ప్రధాన నియోజకవర్గాల నుంచి భారీ సమీకరణకు సన్నాహాలు చేస్తున్నారు. మహానాడు స్థాయిలో ఈ సూపర్ హిట్ విజయోత్సవ సభను నిర్వహించాలని టీడీపీ భావిస్తోంది.

ఏర్పాట్లలో కొందరు.. జన సమీకరణలో ఇంకొందరు..

రాష్ట్ర మంత్రి రవికుమార్, ఎమ్మెల్యేలు సాంబశివ రావు, డాక్టర్ ఉగ్ర, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య తదితరులు రెండు రోజులుగా అనంతపురంలోనే మకాం వేశారు. కొందరు సభా ఏర్పాట్లు, మరికొందరు జన సమీకరణలో ఉన్నారు. అనంతపురంలో ఉన్న ఉమ్మడి జిల్లా నేతలు ఆదివారం అక్కడికి సమీపంలోని వెంకటాపురం వెళ్లి దివంగత టీడీపీ నేత పరిటాల రవీంద్ర ఘాట్‌ను సందర్శించి నివాళులర్పించారు. ఆయన నివాసానికి వెళ్లి రవీంద్ర సతీమణి, ప్రస్తుత రాప్తాడు ఎమ్మెల్యే సునీత, యువనేత శ్రీరాములును కలిశారు. గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు,నేతలు ఆదివారంరాత్రికి అనంతపురం చేరుకున్నారు. సోమవారం నుంచి వారు కూడా ఏర్పాట్లలో భాగస్వామ్యం కానున్నారు.


పోలీసులపై దాడి చేస్తున్న వైసీపీ కార్యకర్తలు

పోలీసులపై వైసీపీ కార్యకర్తల దాడి

వినాయక విగ్రహాల ఊరేగింపులో డీజే వద్దన్నందుకు దౌర్జన్యం

ఒంగోలు తాలుకా స్టేషన్‌లో కేసు నమోదు

ఒంగోలు క్రైం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వినాయక విగ్రహాల ఊరేగింపు సందర్భంగా డీజే సౌండ్స్‌ను అడ్డుకున్న పోలీసులపై వైసీపీ కార్యకర్తలు దౌర్జన్యం చేశారు. ట్రాఫిక్ ఎస్సైతోపాటు కానిస్టేబుల్‌పై దాడికి దిగారు. ఈ ఘటన ఆదివారం ఒంగోలులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వినాయక విగ్రహాల ఊరేగింపు సందర్భంగా నగరంలో డీజేల వినియోగంపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఆదివారం స్థానిక కూచిపూడి వారి వీధి నుంచి కొత్తపట్నంలో నిమజ్జనం చేసేందుకు వినాయక విగ్రహాన్ని తీసుకెళుతున్నారు. కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ వద్ద డీజే సౌండ్స్‌ను నిలిపివేయాలని విధుల్లో ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తాము వైసీపీ వారిమన్న కారణంతో వివక్ష చూపుతున్నారా? అంటూ కూచిపూడి వీధికి చెందిన వారు పోలీసులకు ఎదురు తిరిగారు. వారిని నెట్టుకుంటూ డీజే సౌండ్స్‌తోనే ఊరేగింపు కొనసాగించారు. విధుల్లో ఉన్న తాలూకా ఎస్సై శ్రీహరిని చుట్టుముట్టారు. సెట్‌లో సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాసరావు, కానిస్టేబుల్ రవితేజ, సిబ్బంది అక్కడికి చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాసరావు, కానిస్టేబుల్ రవితేజపై వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. ఈమేరకు ట్రాఫిక్ కానిస్టేబుల్ ఫిర్యాదు చేయడంతో 50 మందిపై ఒంగోలు తాలుకా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

డీఎస్పీ కార్యాలయంలో దౌర్జన్యం.. చుండూరిపై కేసు

కూచిపూడి వీధికి చెందిన వారిపై కేసుల నమోదుకు నిరసనగా వైసీపీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవి, మరికొందరు ఆదివారం సాయంత్రం డీఎస్పీ కార్యాలయంలోకి చొచ్చుకొని వెళ్లే ప్రయత్నం చేశారు. అడ్డుకున్న కానిస్టేబుల్‌పై దౌర్జన్యానికి దిగారు. దీంతో టూటౌన్ పోలీసు స్టేషన్‌లో చుండూరి రవితోపాటు మరో ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి 41 నోటీసులు జారీ చేశారు.

డీఎస్సీ సర్టిఫికెట్ల పునఃపరిశీలన

- అర్హులకు అన్యాయం జరగకుండా చర్యలు
- ఇప్పటికే రెండు విడతలుగా ప్రక్రియ
- మూడోసారి కూడా నిర్వహణ


అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ఉపాధ్యాయ ఉద్యోగాల ఎంపికను వంద శాతం పారదర్శకంగా నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ పటిష్ట చర్యలు చేపట్టింది. బోగస్ అభ్యర్థులకు అవకాశం లేకుండా, అర్హులకు అన్యాయం జరగకుండా సర్టిఫికెట్ల పునఃపరిశీలనతో జల్లెడ పడుతోంది. ఇప్పటికే రెండుసార్లు పరిశీలన ప్రక్రియను చేపట్టింది. ప్రస్తుతం మూడోసారి కూడా నిర్వహించింది. రెండోసారి పరిశీలనలో మొదటి విడత అనర్హులుగా ప్రకటించిన వారు అర్హులుగా తేలడంతో వారికి ఎంపిక జాబితాలో అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన సర్టిఫికెట్ల పరిశీనలో ఇంకా ఏమైనా పొరపాట్లు జరిగాయేమోనన్న అనుమానంతో ఆదివారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను చేపట్టారు. గతంలో ఒక బృందం పరిశీలించిన వాటిని మరో టీంతో పునఃపరిశీలన చేయిస్తున్నట్లు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి తెలిపారు. తొలివిడత పరిశీలనకు 657 మంది అభ్యర్థులను ఆహ్వానించగా వారిలో 652 మంది అర్హులుగా తేలారు. మిగిలిన ఐదుగురిలో ఇద్దరికి సర్టిఫికెట్లు రాకపోవడంతో అనర్హులుగా ప్రకటించారు. మరో ముగ్గురు ఈ పోస్టులు వద్దని చెప్పారు. రెండో విడత 19 మంది సర్టిఫికెట్లను పరిశీలించారు. మూడో విడత ఐదుగురు అభ్యర్థులను పిలిచారు. వీరికి ఆదివారం శ్రీసరస్వతి జూనియర్ కళాశాలలోనే సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించి అర్హులుగా ధ్రువీకరించారు.


-ఆంధ్రజ్యోతి, కొత్తపట్నం

భారీగా నిమజ్జనాలు

వినాయక నిమజ్జనాలు కొనసాగాయి. పెద్దసంఖ్యలో గణనాథుడి విగ్రహాలతోపాటు ప్రజలు రావడంతో తీరప్రాంతంలో సందడి వాతావరణం కన్పించింది. శనివారం రాత్రికి తరలించిన భారీ విగ్రహాలను ఆదివారం గంగ ఒడికి చేర్చారు.


స్కూలులో లోపల ఉన్న మురుగు గుంతలు, చెత్తాచెదారం

మా 'బడి గోడు' పట్టించుకోరా..!

- బ్లాక్‌బోర్డులు, బీరువాలు, బెంచీలు లేని స్కూలు
- మరుగుదొడ్లు లేక అవస్థలు
- ఒంగోలులో ఓ ప్రభుత్వ పాఠశాల దీనస్థితి

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడంతోపాటు విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అయితే జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరం సత్యనారాయణపురంలోని ఓ ప్రాథమిక ప్రభుత్వ పాఠశాలలో కనీసం గోడలు కూడా కరువయ్యాయి. ఎండచ్చినా.. వాన కురిసినా విద్యార్థుల కష్టాలు ఎవరికీ పట్టడం లేదు. ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు పేద, మధ్య తరగతి విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా, వారికి నలుగురు మహిళా ఉపాధ్యాయులు ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. అయితే వారికి కనీస సౌకర్యాలు కరువయ్యాయి. శ్లాబు కింద చదువులతో నానా అవస్థలు పడుతున్న విద్యార్థులు తమ బడిగోడు పట్టించుకోవాలని వేడుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో 2022లో నాడు-నేడు కింద రూ.42లక్షల వ్యయంతో పాఠశాల భవన నిర్మాణానికి పనులు చేపట్టారు. కాగా రూ.19.35 లక్షలు మాత్రమే నిధులు మంజూరు కావడంతో ప్రస్తుతం పిల్లర్లు వేసి, శ్లాబుతో సరిపెట్టారు. నాటి నుంచి కనీస గోడలు, మరుగుదొడ్లు, ఫ్లోరింగ్ కూడా నిర్మించలేదు. విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు బ్లాక్ బోర్డు కూడా లేని దీనస్థితి నెలకొంది. 1 నుంచి 5వ తరగతి వరకు విద్యనభ్యసించేందుకు గతంలో 114 మంది రాగా, ప్రస్తుతం 43 మంది ఆడపిల్లలు మాత్రమే ఉన్నారు. అయితే ఇంటిలో నుంచి కాలు బయట పెట్టి స్కూలుకు వస్తే తిరిగి ఇంటికి వెళ్ళే వరకు ఒకటికీ.. రెంటికీ ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. మరుగుదొడ్లు కూడా లేవు. పిల్లలకు పాఠాలు చెప్పేందుకు కనీసం బ్లాక్ బోర్డులు, రికార్డులు భద్రం చేసుకునేందుకు బీరువాలు, విద్యార్థులు కూర్చునేందుకు కుర్చీలు కూడా లేకపోవడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల వైపు కన్నెత్తి చూసేవారు కరువయ్యారంటూ మండిపడుతున్నారు. తమ పిల్లలు ఇలాంటి పరిసరాల్లో ఎలా చదువుకోవాలంటూ ప్రశ్నిస్తున్నారు. మా పాఠశాల గోడు ఆలకించేవారు లేరని విద్యార్థులు వేదన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు దృష్టి సారించి పాఠశాలకు పూర్తి స్థాయి గోడలు నిర్మించడంతోపాటు, కనీస సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు.


అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం

రాజకీయ జోక్యంతో అట్రాసిటీ చట్టం నిర్వీర్యం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజకీయ జోక్యంతో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం నిర్వీర్యం అవుతుందని పలువురు పేర్కొన్నారు కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో అట్రాసిటీ బాధితులతో న్యాయవాదులు ముఖాముఖి కార్యక్రమం జరిగింది. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, న్యాయవాది అట్లూరి రాఘవులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.రఘురాం, తిరుపాలు మాట్లాడారు. హైకోర్టు న్యాయవాది షేక్ కరీముల్లా, న్యాయవాది ఎ.సుధాకర్ అట్రాసిటీ కేసుల పరిష్కారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు ఏడుకొండలు, ఎండీ.యాసిన్, డి.హరిబాబు, సుధీర్, గ్రేస్‌కుమారి, బడుగు రూపేష్, రఘురామయ్య, నాగయ్య, మోజేష్, రామారావు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ఆవరణలో బేల్దారి ఆత్మహత్య

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆర్టీసి డిపో ఆసుపత్రి ఆవరణంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన ఆదివారం ఉదయం వెలుగు చూసింది. వివరాలలోకి వెళితే.. సంతనూతలపాడు మండలం చిలకపాడుకు చెందిన బుడంగుంట బ్రహ్మయ్య (41) బేల్దారు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన భార్య నాలుగేళ్ళగా దూరంగా ఉంటున్నది. దీంతో మనస్తాపానికి గురైన బ్రహ్మయ్య శనివారం రాత్రి చిలకపాడు నుంచి ఒంగోలు వచ్చి తన లుంగీ చించుకొని ఉరేసుకుని చనిపోయాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల విజేతలు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఒంగోలు తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం స్థానిక సీవీఎస్ రీడింగ్ రూమ్ ఆవరణంలో జరిగిన బెల్ట్ టెస్ట్‌లో ప్రతిభ చాటిన వారికి నిర్వాకులు, కోచ్ షేక్ కరిముల్లా బెల్ట్‌లు, సర్టిఫికేట్‌లు ప్రదానం చేశారు. బాలుర విభాగంలో రుత్విక్, రోహిత్, షాదాబ్, సూర్యప్రకాష్, జితేష్‌రెడ్డి, ముస్తాఫా, లోహిత్, మోహిత్ రెడ్‌బెల్ట్ సాధించగా, అలాగే హేమంత్, నాగసాయి బ్లూబెల్ట్ సాధించారు. అలాగే బాలికల విభాగంలో రవితరణి, సహస్ర రెడ్‌బెల్ట్, సాదియా, అన్‌జూం, మనస్వి ఎల్లోబెల్ట్ సాధించారు.

ఏచూరికి నివాళి

సంతనూతలపాడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే ప్రజల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన గొప్ప నాయకుడు సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా నాయకుడు నెరుసుల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సీతారాం ప్రథమ వర్ధంతి సందర్భంగా సంతనూతలపాడులో నివాళులర్పించారు. కార్యక్రమంలో కోదాటి కోటేశ్వరరావు, బంకా సుబ్బారావు, మస్తాన్, ఎస్‌వీ.నరసింహారావు, శేషారావు, నాగూర్ పాల్గొన్నారు.

జరుగుమల్లి/కొండపి: సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు ఆదివారం మిట్టపాలెంలో జరిగిన ఏచూరి వర్ధంతి సభలో నివాళులర్పించారు. కార్యక్రమంలో మస్తాన్, సుధాకర్, పిచ్చయ్య, జి.వందనం, గడ్డం సురేష్, ఎస్తేరమ్మ, నవీన్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వరాహ లక్ష్మీనరసింహుడికి పూజలు

- చంద్రగ్రహణంతో ఆలయం మూసివేత


ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు


ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు

సింగరాయకొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మూడో రోజు స్వామికి పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మూల విరాట్ వరాహ లక్ష్మీనరసింహస్వామి, ఉభయ దేవేరులు శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను, యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడిని పుష్పాలతో అలంకరించారు. అర్చకులు స్వామికి ప్రధానహోమం, నిత్య హోమం, హూత్సం, పవిత్ర సమర్పణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పి.కృష్ణవేణి, రికార్డు అసిస్టెంట్ బాపట్ల బ్రహ్మయ్య, ప్రధాన అర్చకులు వెంకటశేషాలక్ష్మీనరసింహాచార్యులు, నరసింహాచార్యులు, సుదర్శనాచార్యులు పాల్గొన్నారు. చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం 1గంట నుంచి ఆలయాన్ని మూసివేశారు. సోమవారం ఉదయం ఆరుగంటలకు ఆలయాన్ని శుద్ధిచేసి నాల్గో రోజు పవిత్రోత్సవాలు నిర్వహిస్తామని ఈవో తెలిపారు.

టంగుటూరు మండలంలో...

టంగుటూరు/కొండపి: టంగుటూరు మండలంలోని వల్లూరమ్మ ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం ఈవో బి.రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది మూసివేశారు. చంద్రగ్రహణం ఆదివారం రాత్రి ఏర్పడుతుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని, సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం తెరుస్తామని తెలిపారు.

- జరుగుమల్లి మండలం కామేపల్లిలోని పోలేరమ్మ ఆలయాన్ని గ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఆలయ ఈవో బైరాగిచౌదరి ఆధ్వర్యంలో సిబ్బంది మూసివేశారు. కొండపి మండలంలోని పలు ఆలయాలను గ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు మూసివేశారు.

మంత్రి స్వామికి సింగయ్య కృతజ్ఞతలు


మంత్రి స్వామిని సత్కరిస్తున్న సింగయ్య

సింగరాయకొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ సీనియర్ నేత సింగయ్య ఆదివారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పూలమాలవేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య నేతలు నర్రా రాంబాబు, నవిడిబోయిన మరళి, కానాల బాలాజీ, రాజా, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

- ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన వేల్పుల సింగయ్యను ఆదివారం కందుకూరు రోడ్డు సెంటర్‌లో ఆయన నివాసం వద్ద మండల బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర డైరెక్టర్‌గా నియమితులైనందుకు అభినందనలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు తల్లపనేని రమేష్ పాల్గొన్నారు. కాగా రాత్రికి సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని ఫకీర్‌పాలెంలో ముస్లింల ఆధ్వర్యంలో సింగయ్యను సత్కరించారు.

మంత్రి స్వామికి ప్రజల వినతులు

టంగుటూరు/కొండపి: మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆదివారం ఉదయం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. ఈసందర్భంగా పలువురు సీఎంఆర్ఎఫ్ సాయం కోసం, పక్కా గృహాలు మంజూరు కోసం వినతిపత్రాలు అందజేశారు.

ఉలిచిలో ఘనంగా గురుపూజోత్సవం

- కోటేశ్వరరావు మాస్టారుకు సత్కారం



కోటేశ్వరరావు మాస్టర్‌ను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

ఒంగోలు(రూరల్), సెప్టెంబరు7(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం ఉలిచిలోని జడ్పీ హైస్కూలులో ఆదివారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీశారదానికేతన్ వ్యవస్థాపకుడు, ప్రిన్సిపాల్ దివి కోటేశ్వరరావు మాస్టార్‌ను పూర్వ విద్యార్థులు సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఉలిచి పరిసర గ్రామాల్లో హైస్కూల్ లేని రోజుల్లో కోటేశ్వరరావు మాస్టర్ ఉన్నత విద్య బోధించారని చెప్పారు. ఫీజులు ఇచ్చినా, ఇవ్వలేకపోయినా విద్యార్థుల అభివృద్ధి కోసం ఎంతో కృషి చేయాలని కొనియాడారు. అనంతరం కోటేశ్వరరావు మాస్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థాయి ఎదగడంలో తల్లిపాత్ర ఎంతో కీలకంగా ఉంటుందన్నారు. సెల్‌ఫోన్‌లు, టీవీలకు ప్రాధాన్యత ఇవ్వకుండా వారి పిల్లల భవిష్యత్ కోసం పాటుపడాలని సూచించారు. తాను నెలకొల్పిన శ్రీశారదానికేతన్‌లో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉండటం చూసి ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం కోటేశ్వరరావు మాస్టర్ దంపతులను సత్కరించి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో చుంచు శేషయ్య, డాక్టర్ చుంచు చలమయ్య, వై.నరసింహారావు, శిరిగిరి రంగారావు, గోరంట్ల రవికుమార్, చుంచు వెంకట్రావు, మాటిస్సోరి ప్రకాశ్, సీహెచ్‌జీ.కృష్ణంరాజు, పూర్వవిద్యార్థులు మండవ రవి, చుంచు వెంకట్రావు, చుంచు రామచంద్రరావు, చుంచు రామాంజనేయులు, బోయిడి ఆంజనేయులు, గార్లపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం జరిగింది.

ఉత్సాహంగా లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్ ప్రమాణ స్వీకారం

- హాజరైన పలువురు ప్రముఖులు



ప్రమాణస్వీకార సభలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శిద్దా రాఘవరావు, అతిథులు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ 8వ క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్ వేడుక ఆదివారం ఒంగోలులోని పీపీజీఫంక్షన్ హాలులో ఘనంగా జరిగింది. సీహెచ్.హరిప్రసాద్ అధ్యక్షత వహించగా, క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ పర్వతనేని సుభాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగిన లయన్స్ క్లబ్ సేవల్లో భాగస్వాములు కావడం అదృష్టమన్నారు. మరో అతిథి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్‌తో తనకు అవినావభావ సంబంధం ఉందన్నారు. లయన్స్ క్లబ్ కార్యక్రమాల్లో తనవంతు సహకారం ఉంటుందని చెప్పారు. కాగా క్లబ్ గవర్నర్‌గా లక్ష్మీనారాయణ, సెక్రటరీగా నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఎస్.వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మూల్పూరి ఉపేంద్ర, డాక్టర్ అంబటి సుధాకర్, మేకా శ్రీరామ్ సురేష్, నామినేని మోహన్‌రావు, వీపీఎస్.ఆంజనేయులు, శేషగిరి, వేణుబాబు విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


వేడుకలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని పీవీఆర్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉపాధ్యాయ దినోత్సవం పీవీఆర్ శతాబ్ది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీఆర్ పాఠశాలలో పనిచేసి, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులను, అక్కడే చదువుకుని ఉపాధ్యాయులుగా ఎదిగి తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కొప్పోలు హనుమంతరావు, గుడ్లూరు రామచంద్రరావు, వారణాసి శ్రీనివాసశాస్త్రి, అంబటి రామోహన్‌రావు, ఎస్.విజయలక్ష్మి, పి.మునిభూషణ్‌రావు, విజయకుమారి, సత్యజ్యోతి, కొఠారి వెంకటేశ్వరరావు, వడ్లమాని వీరయ్య, పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఆరిగ వీరప్రతాప్, బోడపాటి సుబ్బారావు, కాటా ఆంజనేయులు, తాతి విజయ్‌కుమార్, తాతా శ్రీనివాసరావు, కేంద్రీయ విద్యాలయ రిటైర్డ్ ప్రిన్సిపాల్ బి.సూర్యప్రకాష్, కార్పొరేటర్ ఈదర వెంకటసురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

20న తీరంలో స్వచ్ఛసాగర్

కొత్తపట్నం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల నిమజ్జనాలతో కొత్తపట్నం సముద్ర తీరంలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించనున్నట్లు మత్స్యకార సంక్షేమ సమితి నాయకులు తెలిపారు. ఆదివారం సమితి నాయకులు తీరంలో పర్యటించారు. నిమజ్జనం సందర్భంగా తీరానికి కొట్టుకు వచ్చిన విగ్రహాల వ్యర్థాలను పరిశీలించారు. గ్రామ సర్పంచ్ ఆనందరావు, అధికారులను కలిసి మాట్లాడారు. ప్రతి ఏటా ఘనంగా తీరంలో నిర్వహించే స్వచ్ఛసాగర్, సురక్షిత సాగర్ కార్యక్రమాన్ని ఈ నెల 20వ తేదీన తీరంలో జరపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛసాగర్-సురక్ష సాగర్ ఇన్‌చార్జి సున్నపు తిరుపతిరావు, బీచ్ ఇన్‌చార్జి రేవు చలపతిరావువర్మ, మత్స్యకార సంక్షేమ సమితి అధ్యక్షుడు పొన్నపూడి వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కిలగడ్డ శ్రీనివాసులు, కొండూరి తిరుపతిరావు, నాయుడు ఈశ్వరరావు, పొన్నెపూడి రోశయ్య పాల్గొన్నారు.

బ్రిడ్జి రైలింగ్ పైకి ఎక్కిన లారీ


బ్రిడ్జిపై వేలాడుతున్న లారీ

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం రైల్వే స్టేషన్ వద్ద ఓవర్ బ్రిడ్జిపై ఆదివారం తెల్లవారుజామున అదుపు తప్పి రైలింగ్‌ను టిప్పర్ ఢీకొట్టిన ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. చీమకుర్తి నుంచి పెద్దారవీడుకు కంకరలోడుతో టిప్పర్ వచ్చి అన్‌లోడ్ చేసి తిరిగి చీమకుర్తికి వెళుతుంది. ఈ క్రమంలో మార్కాపురం రైల్వేస్టేషన్ సమీపంలోని ఓవర్ బ్రిడ్జి పైకి రాగానే కుడివైపు ఉన్న రైలింగ్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ శ్రీనివాసులు, క్లీనర్ కిందికి దిగారు. టిప్పర్ మాత్రం వేలాడుతూ ఉండిపోయింది. బ్రిడ్జి కింద నివాసాలు కూడా ఉండడంతో వారంతా శబ్దానికి బయటకు పరుగు తీశారు. ఘటనా స్థలాన్ని రూరల్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

కీర్తి ఎక్స్‌క్లూజివ్ బేబీ కేర్ ప్రారంభం


బేబీకేర్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక మంగమూరురోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కీర్తి ఎక్స్‌క్లూజివ్ బేబీకేర్, సర్జికల్స్‌ను ఆదివారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ షోరూంను కృష్ణసాయి ఎక్స్‌పోర్ట్ ఎండీ శిద్దా హనుమంతరావు ప్రారంభించగా, మొదటి కొనుగోలుకు జీపీ పెంచల్‌రెడ్డి చేశారు. డాక్టర్ సెంథిల్‌కుమార్, డాక్టర్ దీప జ్యోతి ప్రజ్వలన చేయగా క్యాష్‌కౌంటర్‌ను శ్రీవాసవి గ్రానైట్స్ ఎండీ శిద్దా పాండురంగారావు ప్రారంభించారు. కార్యక్రమానికి వచ్చిన అతిథులను ఎల్.తిరుపతిరెడ్డి, ఎల్.వెంకటేశ్వరరెడ్డి స్వాగతించారు.

'రామాయణ రత్నమాల సుందరకాండ' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రవికుమార్, డిప్యూటీ మేయర్ బుజ్జి

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఫ్యాన్సీ గూడ్స్ మర్చంట్స్ అసోషియోషన్ హాలులో ఆదివారం రామాయణ రత్నమాల సుందరకాండ పుస్తకావిష్కరణ జరిగింది. శనగపల్లి సుబ్బారావు రచించిన ఈ పుస్తకాన్ని శ్రీహర్షిణి విద్యాసంస్థల అధినేత కె.రవికుమార్ ఆవిష్కరించారు. గాడేపల్లి దివాకర్ దత్తు అధ్యక్షత నగర డిప్యూటి మేయర్ వేమూరి బుజ్జి జ్యోతి ప్రజ్వల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాయణంలో కొన్ని పద్యాలు ఈ పుస్తకంలో సవివరంగా వివరించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికీ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆదిపూడి గిరిజాశాండిల్య, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, ఉన్నంజ్యోతి, కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సీవీ.రామకృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, మైనంపాటి సాయికుమార్, సీహెచ్.భాస్కర్, శనగపల్లి శ్రీనివాసరావు, శనగపల్లి రవితేజ పాల్గొన్నారు.

గృహ రుణాలపై అవగాహన

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భారతీయ స్టేట్ బ్యాంకు ఒంగోలు బిజినెస్ ఆఫీసు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రంగారాయుడు చెరువు కట్టపై తమ బ్యాంకు ద్వారా అందిస్తున్న గృహనిర్మాణాలు, బిజినెస్, వ్యక్తిగత రుణాలు, బంగారురుణాలపై విస్తృతంగా వాకర్స్‌కు అవగాహన కల్పించారు. రీజనల్ మేనేజర్ పి.శ్రీనివాసరావు, చీఫ్ మేనేజర్ రామారావు, సంతేశ్వరరావు, రవికుమార్, రాజేష్‌కుమార్, ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు పి.శ్రీనివాసరావు, సీహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



ఉపాధ్యాయులను సత్కరించిన మేయర్, డీఈవో

ఒంగోలు విద్య, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని మేయర్ గంగాడ సుజాత పేర్కొన్నారు. అపుస్మా ఆధ్వర్యంలో ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల ప్రదానోత్సవంలో ఆమె మాట్లాడారు. సభకు జిల్లా అధ్యక్షుడు కొల్లామాధవరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మరో అతిథి డీఈవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆధునిక సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలక పాత్రపోషించాలని కోరారు. కార్యక్రమంలో జోన్ అధ్యక్షుడు వీవీ.సుబ్బారావు, శ్రీప్రతిభ కళాశాల అధినేత నల్లూరి వెంకటేశ్వర్లు, శ్రీహర్షిణి కళాశాల అధినేత గోరంట్ల రవికుమార్, శ్రీసరస్వతి విద్యాసంస్థల అధిపతి రమణారెడ్డి, టీడీపీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసచౌదరి, శ్రీనివాసరావు, మురళీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం 100మంది ఉపాధ్యాయులను సత్కరించారు.

ఎన్టీఆర్ పార్కులో ఉచిత వైద్య శిబిరం

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక చెన్నకేశవ లే అవుట్ ఎన్టీఆర్ పార్కులో ఆదివారం ఉదయం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని క్విస్ విద్యాసంస్థల చైర్మన్ నిడమనూరి నాగేశ్వరరావు ప్రారంభిచారు. 300 మంది వరకు వైద్యపరీక్షలు నిర్వహించారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

చెరువు మాన్యం వేలం పాటలు పూర్తి

జరుగుమల్లి/కొండపి, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): దావగూడూరులోని చెరువు మాన్యం పొలం 26 ఎకరాల 45 సెంట్ల భూమికి కౌలు వేలం పాటలు ఆదివారం పూర్తయ్యాయి. గత ఏడాది కౌలు ధరకు మించి దాదాపు రూ.6 వేల అదనంగా కౌలు వచ్చింది. కార్యక్రమంలో దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు వరదారెడ్డి, సాంబశివరావు పాల్గొన్నారు.



అండర్ 14 జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

పీడీసీఏ ఆధ్వర్యంలో అండర్ -14 క్రికెట్ జట్టు ఎంపిక

● పోటీలకు అధిక సంఖ్యలో హాజరైన క్రీడాకారులు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ప్రకాశం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ - 14 బాలుర క్రికెట్ జట్టు ఎంపికకు విశేష స్పందన లభించింది. రాష్ట్ర స్థాయి క్రికెటర్ సీహెచ్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఒంగోలు మంగమూరు రోడ్‌లోని ఏసీఏ సబ్ సెంటర్ క్రీడా మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీడీసీఏ సెక్రటరీ కారుసాల నాగేశ్వరరావు మాట్లాడుతూ అండర్-14 జిల్లా జట్టు ఎంపిక పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 90 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. వీరిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు 39 మందిని ఎంపిక చేయగా, వారికి బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలోని క్రికెట్ స్టేడియంలో మరోసారి మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్యాటింగ్, బౌలింగ్, కీపింగ్‌లలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిలో 16 మందిని గుర్తించి ఫైనల్ జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఎంపిక పోటీలలో అసోసియేషన్ అధ్యక్షుడు నవీన్ కుమార్, జాయింట్ సెక్రటరీ బచ్చు శ్రీనివాసరావు, కోశాధికారి హనుమంతరావు, సభ్యులు బలరాం, నల్లూరి రవి పాల్గొని పర్యవేక్షించారు.



పీడీసీసీబీ చైర్మన్ సీతారామయ్యతో వివిధ సొసైటీల చైర్మన్లు

సొసైటీల నుంచి రైతులకు ఎరువులు

● పీడీసీసీ బ్యాంకు చైర్మన్ సీతారామయ్య

ఒంగోలు విద్య, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని రైతులకు సొసైటీల ద్వారా సరిపడా ఎరువులు సరఫరా చేస్తున్నట్లు పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య తెలిపారు. సొసైటీలకు అవసరమైన మేరకు ఎరువులు కేటాయింపునకు మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు సొసైటీలు కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు అందిస్తున్నాయన్నారు. జిల్లాలో ఎరువుల కొరతపై ప్రతిపక్షాలు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాయని సీతారామయ్య మండిపడ్డారు. రైతులకు రుణాల పంపిణీలో కూడా సొసైటీల నూతన పాలకవర్గాలు చురుకుగా వ్యవహరించాలని కోరారు.ఆదివారం మార్కెట్ కమిటీ చైర్మన్, వివిధ సొసైటీల చైర్మన్లు బ్యాంకు చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. బ్యాంకు చైర్మన్‌ను కలిసిన వారిలో పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకట్రావు, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. రామకృష్ణ, ఇంకొల్లు మండల సొసైటీ చైర్మన్ కరి శ్రీనివాస్, బి.సుబ్బారావు, నారిశెట్టి రాంబాబు, టంగుటూరి సొసైటీ చైర్మన్ మక్కెన హరిబాబు తదితరులు ఉన్నారు.



పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న డీఆర్వో ఓబులేశు

ప్రశాంతంగా ఫారెస్ట్ ఉద్యోగాల పరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్,సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) :అటవీశాఖలోని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులను భర్తీచేసేందుకు ఆదివారం నిర్వహించిన స్ర్కీనింగ్‌టెస్టు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఒంగోలుతోపాటు సమీప ప్రాం తాల్లో పది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేశు పరిశీలించారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు 7,052 మంది దరఖాస్తు చేసుకోగా 5,642 మంది పరీక్షకు హాజరు అయ్యారు. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టులకు 1,153 మంది దరఖాస్తు చేసుకోగా 901 మంది పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షలు ఆఫ్‌లైన్ పద్ధతిలో ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా జరిగాయి. పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన డీఆర్వో సంతృప్తి వ్యక్తం చేశారు.

టోల్ ఫ్రీ 1100 నెంబరుతో అర్జీల పరిష్కార సమాచారం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని కలెక్టరేట్‌లో ప్రతిసోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కారవేదికకు వచ్చే అర్జీలకు సంబంధించిన పరిష్కార సమాచారాన్ని 1100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా తెలుసుకోవచ్చని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లాలోని ఆర్డీవో కార్యాలయాలు, మునిసిపల్ కార్యాలయాలు, మండల కేంద్రాల్లో సోమవారం అర్జీల స్వీకరణ జరుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లో ఇచ్చే అర్జీలకు సంబంధించిన సమస్యల పరిష్కారమైనాన్ని, ఏదశలో ఉందో 1100 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. జిల్లాలోని ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

నలుగురు స్కూలు అసిస్టెంట్లకు రివర్షన్

● వారి స్థానాల్లో కొత్తవారికి ఉద్యోగోన్నతి

ఒంగోలు విద్య, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : జిల్లా విద్యాశాఖలో ఒకే రోజు నలుగురు స్కూలు అసిస్టెంట్లకు ఎస్‌జీటీలుగా రివర్షన్, మరో నలుగురు ఎస్‌జీలకు కొత్తగా స్కూలు అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు ఇస్తూ జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులతో గతంలో ఉద్యోగోన్నతుల్లో జరిగిన తప్పులను డీఈవో సరిచేసినట్లు అయింది. ఉమ్మడి జిల్లాలో జరిగిన టీచర్ల ఉద్యోగోన్నతుల్లో స్కూలు అసిస్టెంట్ సోషల్ స్టడీస్ ఉద్యోగోన్నతుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయి. 17 మందికి ఉద్యోగోన్నతులు ఇవ్వగా వారిలో నలుగురు జూనియర్లు అయినా పదోన్నతులు ఇచ్చారు. దీని వల్ల తమకు అన్యాయం జరిగిందని కందులూరు ఎంపీయూపీ స్కూలులో ఎస్‌జీటీగా పనిచేస్తున్న ఎస్.రాధారాణి కలెక్టర్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్, ముఖ్యమంత్రి చం ద్రబాబు , విద్యాశాఖ మంత్రి నారాలోకేష్‌లకు ఫిర్యాదు చేశారు. ఈఫిర్యాదుపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. సోషల్‌స్టడీస్ ప్రమోషన్లకు రీకౌన్సెలింగ్ నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. తదనుగుణంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. తొలుత ప్రమోషన్ పొందిన నలుగురు టీచర్లకు నోటీసులు జారీ చేశారు. ఆ నోటీసులకు వారు ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో వారికి తిరిగి ఎస్‌జీలుగా రివర్షన్ ఇచ్చారు.వారి స్థానాల్లో ప్రమోషన్ కోరుకున్న నలుగురికి నియామక ఉత్తర్వులు డీఈవో జారీ చేశారు.

అరటి అధరహో..!

కంభం మండలంలో 400 ఎకరాలకు పైగా సాగు

పసుపుపచ్చ, సుగంధాల రకాలకు మారుపేరు

ఎకరాకు రూ. లక్ష వరకు ఆదాయం

ఇతర ప్రాంతాలకు ఎగుమతి

లాభాలు ఆర్జిస్తున్న రైతులు

కంభం ప్రాంతంలో అరటి తోటల సాగు రైతులకు లాభాలను ఆర్జించి పెడుతోంది. ఎకరాకు సుమారు రూ.70 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు ఖర్చులు పోను రూ.లక్ష వరకూ ఆదాయం పొందుతున్నారు. దీంతో ఏటేటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రస్తుతం ఇక్కడ పండిన పసుపుపచ్చ, సుగంధాల రకాలకు మంచి గిరాకీ ఉంది. వ్యాపారులు సైతం ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అరటి గెల కాయలను బట్టి రూ.150 నుంచి రూ.250 వరకు ధర ఇస్తున్నారు. సంప్రదాయ పంటలు సాగు చేసి సరైన ధరలు లభించక ఇబ్బందులు పడ్డ రైతులు అరటి సాగుతో లాభాలు వస్తుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కంభం ప్రాంతంలో సాగులో ఉన్న అరటి తోటలు

కంభం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కంభం నుంచి తురిమెళ్ల మీదుగా గిద్దలూరు వెళ్లే మార్గంలో 3 కిలోమీటర్ల పొడవునా రహదారికి ఇరువైపులా సాగు చేసిన అరటి తోటలు పచ్చదనంతో ఆహ్లాదకరంగా స్వాగతం పలుకుతున్నాయి. దశాబ్ద క్రితం వరకు కంభంలో వెయ్యి ఎకరాలకు పైగా చెరకు సాగు చేసేవారు. అయితే అడవి పందుల దాటికి తట్టుకోలేక రైతులు చెరకు పంటను ఆపివేశారు. ఆ స్థానంలో అరటి తోటలను సాగు చేయడం ప్రారంభించారు. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలోని కంభం మండలంలో ప్రస్తుతం 400 ఎకరాలకు పైగా పసుపు పచ్చ, సుగంధాల రకం అరటి సాగు అవుతోంది. అరటి సాగు ఎకరాకు ఖర్చులు రూ.70వేలు పోను దాదాపు రూ. లక్ష వరకు మిగులుతున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పిలకలు నాటినప్పటి నుంచి 9నెలల్లో ఒక్కొక్క అరటి చెట్టుకు ఒక్కో గెల కాస్తుంది. గెలకు 120 నుంచి 150వరకు కాయలు కాస్తాయి. ఈ అరటి తోటలకు ఎప్పుడు నీటి తేమ ఉండాలి.

ఇతర ప్రాంతాలకు ఎగుమతి

ఇక్కడ పండించిన అరటి గెలలను కొందరు వ్యాపారులు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. బెంగళూరు, హైదరాబాద్, విజయవాడ, నరసరావుపేట, గుంటూరు, మార్కాపురం తదితర ప్రాంతాలకు లారీల ద్వారా ఎగుమతి అవుతాయి. ప్రస్తుతం ఒక్కో గెల ధర రూ.150 నుంచి రూ.250 వరకు పలుకుతోంది. బాగా పండితే ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.



ఎగుమతి చేసేందుకు సిద్ధం చేసిన అరటి గెలలు



తమిళనాడు నుంచి అరటి పిలకలు తెచ్చా

- రంగనాయకులు, అరటి రైతు

తమిళనాడు నుంచి అరటి పిలకలను తెచ్చా. ఒక్కొక్క పిలకను రూ.5లు చొప్పున కొనుగోలు చేశా. ఎకరాకు 1,000పిలకలు నాటిస్తే అందులో 800 వరకు బాగా పెరుగుతాయి. సాగుకు రూ.60వేల నుంచి రూ.70వేల వరకు ఖర్చు అవుతుంది. పంట బాగా పండితే ఎకరాకు రూ.లక్ష వరకు వస్తాయి. తెగుళ్ల నుంచి జాగ్రత్తగా కాపాడుకోవాలి.

డ్రిప్ పద్ధతిలో సాగు

- సుబ్రహ్మణ్యం, రైతు



డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో కూడా అరటిని సాగు చేస్తున్నాం. ఈ విధానం వలన నీటి వృథా తగ్గడమే కాక సాగు ఖర్చులు బాగా కలిసి వచ్చాయి.

ఎరువుల కేటాయింపులో కంపెనీల వివక్ష

● హోల్‌సేల్ డీలర్ల గుత్తాధిపత్యం

● బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్న ఎరువులు

● అధికారుల దాడుల్లో పట్టుబడుతున్న వైనం

దర్శి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎరువుల కేటాయింపుల్లో కంపెనీలు వివక్ష చూపుతున్నాయి. కేవలం హోల్‌సేల్ డీలర్లకు మాత్రమే కేటాయింపులు జరుగుతున్నాయి. అనుకూలమైన డీలర్లకు పెద్దపీట వేస్తున్నారు. మిగిలినవారు డీడీలు కట్టినప్పటికీ అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. నిల్వలు లేవంటూ సాకులు చెడుతున్నారు. కొంతమంది హోల్‌సేల్ డీలర్లతో కంపెనీలు కుమ్మక్కై మాయాజాలం ప్రదర్శిస్తున్నాయి.

నిబంధనలు పాటించని దుకాణాల యజమానులు

నిబంధనల ప్రకారం దుకాణాల యజమానులు డీడీలు కట్టిన తర్వాత అడిగిన సరుకును కంపెనీలు ఇవ్వాలి. కొన్ని కంపెనీలు నింబధనలు పాటించటం లేదు. తమకు అనుకూలమైన హోల్‌సేల్ డీలర్లకు అధికమొత్తంలో కేటాయిస్తున్నారు. హోల్‌సేల్ డీలర్లు విక్రయాల్లో గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారు. వీరుకూడా వారికి అనుకూలమైన రిటైల్ డీలర్లకు మాత్రమే ఎరువులు విక్రయిస్తున్నారు. మిగిలిన వారికి తూతూ మంత్రంగా ఎరువులు కేటాయిస్తూ ఇబ్బంది పెడుతున్నారు. హోల్‌సేల్ డీలర్లు డిమాండ్ ఉన్న ఎరువులతో పాటు అవసరంలేని ఎరువులను కూడా రిటైల్ దుఖానాలకు అంటకడుతున్నారు. వారు ఇచ్చిన ఎరువులన్నీ తీసుకోకపోతే అవసరమైన ఎరువుల ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. కొన్నిచోట్ల హోల్‌సేల్ డీలర్లు తమకు అనుకూలమైన డీలర్ల ద్వారా ఎరువులను పక్కదారి పట్టిస్తున్నారు. రహస్య ప్రదేశాల్లో బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

పలు చోట్ల పట్టుబడిన నిల్వలు

ఎరువుల విక్రయాల్లో దోపిడీ జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం విజిలెన్స్ అధికారులను తొలుత రంగంలోకి దించింది. జిల్లావ్యాప్తంగా జరిగిన దాడుల్లో అనేకచోట్ల అక్రమ ఎరువుల నిల్వలు పట్టుబడ్డాయి. ఇంకా పూర్తిస్థాయిలో అక్రమ వ్యాపారాన్ని నివారించేందుకు రెవెన్యూ, పోలీసు అధికారులను కూడా రంగంలోకి దించింది. దీంతో ఎరువుల వ్యాపారులు అప్రమత్తమయ్యారు. కొన్నిచోట్ల ఎరువులను శివారు ప్రాంతాల్లోని గోడౌన్‌లలో దాచినట్టు సమాచారం. అధికారులు రిజిష్టర్లు చెక్ చేసినప్పుడు కొంతమంది నిల్వ స్టాక్ చూపుతున్నారు. కేటాయించిన ఎరువులను ఎవరెవరికి విక్రయించారన్న విషయాన్ని లోతుగా పరిశీలిస్తే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల జరిగిన దాడుల్లో పట్టుబడ్డ ఎరువుల నిల్వలు వారికి ఎక్కడ నుంచి వచ్చాయనే విషయంపై నిశితంగా దర్యాప్తు జరుగుతోంది.

సాగర్ ఆయకట్టులో ఎరువులకు డిమాండ్

ప్రస్తుతం సాగర్ ఆయకట్టు ప్రాంతంలో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నందున యూరియా, కాంప్లెక్స్ ఎరువులకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఇదే అదునుగా వ్యాపారులు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో జరిగిన దాడుల్లో పట్టుబడిన యూరియా, ఇతర ఎరువులు వారికి ఎక్కడ నుంచి వచ్చాయనే విషయాన్ని అధికారులు ఏ కారణం చేతనో బయట పెట్టడం లేదు. ఆ విషయాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే ఎరువులు అక్రమంగా ఎలా దారి మళ్లుతున్నాయో బట్టబయలవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఎరువుల విక్రయాలు నిబంధనల ప్రకారం జరిగే విధంగా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

వేసవిని తలపిస్తున్న ఎండలు

● అత్యధిక ప్రాంతాల్లో 38 డిగ్రీలకుపైన గరిష్ఠ ఉష్ణోగ్రతలు

● ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజానీకం

ఒంగోలు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రస్తుత వాతావరణం వేసవిని తలపిస్తోంది. జోరువానలు కురవాల్సిన సమయంలో ఎండలు మండిపోతున్నాయి. అత్యధిక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా నాలుగైదు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. చాలాచోట్ల 36నుంచి40 డిగ్రీలకు చేరువలో ఉంటడంతోపాటు ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

నిండు వర్షాకాలంలో ఎండలు

సాధారణంగా సెప్టెంబరు, నవంబరుల్లో జోరువానలు పడుతుంటాయి. ఈ సమయంలో 30నుంచి 35 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఉంటాయి. అలాంటిది ప్రస్తుతం చాలా ప్రాంతాల్లో 37నుంచి 39 డిగ్రీల వరకూ నమోదవుతున్నాయి. పలుచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలకుపైనే ఉంటున్నాయి. ఆదివారం ఒంగోలులో పగటి పూట ఎండ తీవ్రత అధికంగా ఉంది. 38 డిగ్రీల గరిష్ఠ, 28 డిగ్రీలు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలోని అత్యధిక ప్రాంతాల్లోనూ ఇదేపరిస్థితి కన్పించింది.

ముందుకు సాగని ఖరీఫ్ సాగు

పెరుగుతున్న ఎండల తీవ్రత ఖరీఫ్ పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సాగర్ ఆయట్టులో సాగునీటి భరోసాతో వరినాట్లు ముమ్మరమైనప్పటికీ మిగతా ప్రాంతాల్లో ప్రత్యేకించి మెట్ట పంటల సాగు ముందుకు సాగడం లేదు. ప్రధానమైన కంది పంట 40శాతం విస్తీర్ణంలో కూడా సాగు కాలేదు. మిర్చి నాట్లకు నీరు దొరక్క రైతులు అవస్థ పడుతున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి

● మంత్రి స్వామి

మర్రిపూడి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. ఆదివారం రామాయపాలెంలో మూడురోజులుగా జరుగుతున్న నాగార్పమ్మ దేవత కొలుపుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మంత్రి దృష్టికి సమస్యలను తీసుకెళ్లారు.

కొన్నేళ్లుగా పాఠశాల పక్కనే కుంటలో పాకలు వేసుకొని జీవిస్తున్నామని, పక్కాగృహాలు మంజూరు చేయాలని పలువురు యానాదులు వేడుకున్నారు. నాలుగైదు నెలల్లో పక్కాగృహాలు మంజూరు చేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఎస్సీకాలనీ, గ్రామంలో డ్రైనేజ్ కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని గ్రామస్థులు కోరారు. కొండపికి బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జంగాలపల్లిలో 20 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని గతంలో చెప్పినప్పటికీ విద్యుత్ అధికారులు కేవలం 10మాత్రమే ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించలేదని మాజీ సర్పంచ్ మురళీ ఫిర్యాదు చేశారు. వెంటనే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని విద్యుత్ అధికారులను ఫోన్‌లో మంత్రి ఆదేశించారు. వెలిగొండ ప్రధానకాలువ నుంచి పునుగోడు రిజర్వాయర్ ద్వారా కృష్ణా జలాలను మర్రిపూడి మండలంలోని అత్యధిక చెరువులను నింపేందుకు అవకాశం ఉందని తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రమోతు శ్రీనివాసులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గ సమన్వయ కర్త రేగుల వీరనారాయణ, చిమట సొసైటీ అధ్యక్షులు మలసాని కోటేశ్వరరావు (కోటు), సర్పంచ్ మలసాని నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రామాయపాలెంలో పర్యటిస్తున్న మంత్రి స్వామి

బహిర్భూమికెళ్లిన యువతిపై లైంగికదాడి

కేకలు వేయడంతో దాడి, గాయాలు

దుండగుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కొత్తపట్నం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఉదయాన్నే బహిర్భూమికి వెళ్లిన యువతిని గుర్తు తెలియని దుండగుడు అత్యాచారం చేసేందుకు ప్రయత్నించాడు. తన దగ్గరకు రావద్దంటూ ఆమె కేకలు వేయటంతో దాడి చేసి గాయపరిచాడు. దీంతో ఆమెకు ముఖంపై గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం ఉదయం కొత్తపట్నం సముద్రం తీరం వద్ద చోటు చేసుకుంది. కొత్తపట్నం పోలీసులు, స్థానికులు అందించిన సమాచారం మేరకు.. కొత్తపట్నం పల్లెపాలెం గ్రామానికి చెందిన యువతి సముద్రతీరం వెంట ఉన్న చెట్ల మరుగులో బహిర్భూమికి వెళ్ళింది.

ఉదయాన్నే ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవటంతో గుర్తు తెలియని స్థానికేతరుడు ఆమెకు సమీపంలోకి వస్తుండటాన్ని గమనించి గట్టిగా అరిచింది. దీంతో ఆ యువకుడు ఆమెపై దాడికి దిగాడు. ముఖంపై తీవ్రంగా కొట్టాడు. దీంతో ఆమె పెద్దగా కేకలు వేసింది. ఈ కేకలు తీరంలో వినాయక నిమజ్జనాల కోసం వచ్చిన భక్తులు విన్నారు. ఆ పక్కనే విధుల్లో ఉన్న పోలీసులకు ఈ విషయాన్ని చేరవేశారు. దీంతో పోలీసులు దుండగుడిని పట్టుకునేందుకు ప్రయత్నించటంతో పారిపోయేందుకు యత్నించాడు. ఎట్టకేలకు పోలీసులు అతన్ని పట్టుకుని కొత్తపట్నం పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇతనిది చీరాలని తెలిసింది. కొత్తపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువతని చికిత్స నిమిత్తం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


తహసీల్దార్ కృష్ణమోహన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

తహసీల్దార్‌గా కృష్ణమోహన్ బాధ్యతలు

త్రిపురాంతకం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : త్రిపురాంతకం తహసీల్దార్‌గా నియమితులైన చీరాల కృష్ణమోహన్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఒంగోలు డీటీగా ఉన్న కృష్ణమోహన్‌కు అడహక్ ఉద్యోగోన్నతి కల్పించి త్రిపురాంతకం తహసీల్దార్‌గా నియమించారు. బాధ్యతలు తీసుకున్న ఆయనను సత్కరించి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ పుల్లలచెరువు తహసీల్దార్ ఇన్‌చార్జిగా ఉన్నారు.

అడుగడుగునా గుంతలు

- ప్రయాణం నరకమంటున్న వాహనదారులు, ప్రజలు
- నల్లగుంట్ల ప్రధాన రహదారిని బాగుచేయాలని విజ్ఞప్తి


గుంతలతో అధ్వానంగా ఉన్న నల్లగుంట్ల ప్రధాన రోడ్డు

పెద్దదోర్నాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమల అటవీ శివారు ప్రాంతం నల్లగుంట్ల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి అస్తవ్యస్తంగా తయారయింది.దీంతో గ్రామ ప్రజలు ఇక్కట్లకు గువుతున్నారు. కర్నూలు -గుంటూరు జాతీయ రహదారి నుంచి 5 కిలోమీటర్ల దూరం కొండ అంచుల వెంట రహదారి ఉంది. గతంలో టీడీపీ హయాంలో 1996-97 మధ్యలో తారు రోడ్డును నిర్మించారు. వర్షాల కారణంగా కొండ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటికి రోడ్డు మొత్తం పాడైపోయింది. ఎక్కడికక్కడ గుంతలు పడి ప్రయాణానికి ఇబ్బంది కరంగా మారింది. గ్రామం మొత్తం వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు కావడంతో సేద్యం కోసం అవసరమయ్యే ఎరువులు తెచ్చుకునేందుకు, పంటల ఉత్పత్తులను తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసులు అతి తక్కువగా ఉండడంతో పాటు అవసరమైన సమయంలో బస్సులు ఉండకపోవడంతో ఆటోలపైనే ఆధార పడాల్సి వచ్చింది. అయితే ఆ గుంతల్లో ఆటోలు దెబ్బతింటాయని చాలా మంది ఆటో యజమానులు ఇష్టపడడం లేదు ఒకవేళ ఎవరైనా వచ్చినా అధిక చార్జీలను వసూలు చేస్తున్నారు. వానా కాలమైతే ఈ రహదారిలో ప్రయాణం నరకమని గ్రామస్థులు వాపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు కూడా ఈ దారిలో ప్రయాణానికి ఇష్టపడడం లేదు. తప్పని పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నామని చెప్తున్నారు. ప్రభుత్వం స్పందించాలని తమ బాధలు తీర్చాలని ప్రజలు కోరుతు న్నారు.


ఈగలపాడులో పొంగళ్లను తీసుకెళ్తున్న మహిళలు

ఘనంగా పోలేరమ్మకు పొంగళ్లు

పొదిలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఈగలపాడు గ్రామంలో ఆదివారం పోలేరమ్మకు, పోతురాజు స్వామికి పొగళ్లతో నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి, స్వామివారికి పొంగళ్లను మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి నివేదించారు. మహిళలు ఉదయం నుంచి ఒక్కపొద్దు ఉండి మెక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకుంది.

26 మంది రక్తదానం

గిద్దలూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతాబ్ది జన్మదినోత్సవం గిద్దలూరులోని ప్రేమసుధా మందిరంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 26 మంది దాతలు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సూరె అనంతరామయ్య, సమితి ప్రతినిధులు ముప్పూరి కాశీశ్వరరావు, మల్లికార్జున్, ఓబులేసు, శింగరి ప్రసాద్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు పండ్ల పంపిణీ

గిద్దలూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని మానసిక దివ్యాంగుల పాఠశాలకు చెందిన విద్యార్థులకు వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో పండ్లు, బిస్కెట్లు, బ్రెడ్లు ఇతర తినుబండారాలను అందచేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు గర్రె సాహితి, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ గర్రె సత్యనారాయణ, రీజనల్ చైర్మన్ ధనుంజయ్‌గుప్త, జిల్లా ఇన్‌చార్జి ముప్పూరి రాజేశ్వరి, రీజనల్ కార్యదర్శి ఆరవీటి చంద్రశేఖర్, జోనల్ చైర్మన్ భవనాశి రామాంజనేయులు, చిన్ని సేవాసంస్థ అధ్యక్షులు శ్రీకాంత్, పాఠశాల ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యం


సైకిల్‌పై వెళుతున్న సీఐ అస్సాన్, ఎస్ఐ శివబసవరాజు

త్రిపురాంతకం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా ప్రభుత్వం ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని చేపట్టిందని త్రిపురాంతకం సీఐ అస్సాన్ అన్నారు. ఇందులో భాగంగా ఆదివారం జాతీయ రహదారిపై ఎస్ఐ శివబసవరాజు, సిబ్బందితో కలిసి ఆయన సైకిల్ తొక్కారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా ఆరోగ్యకర వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గేదెను ఢీకొని ఆటో బోల్తా

- ఇద్దరికి తీవ్ర , మరో ఏడుగురికి స్వల్ప గాయాలు

పుల్లలచెరువు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పొట్టకూటి కోసం పల్నాడు జిల్లా శిరిగిరిపాడు నుంచి కూలీలతో వస్తున్న ఆటో గేదెను ఢీకొని బోల్తా పడిన ఘటన శనివారం రాత్రి జరిగింది. అందిన వివరాల ప్రకారం.. పుల్లలచెరువు మండలం ఉమ్మడివరం గ్రామానికి చెందిన 15 మంది కూలీలు పనులు ముగించుకొని వస్తుండగా పుల్లలచెరువు మండలం మురికిమల్ల పెంటలో గేదె రోడ్డుపైకి రావడంతో ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడింది. స్థానికుల సమాచారంతో వచ్చిన అంబులెన్స్‌లో ఎర్రగొండపాలెం వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. మొత్తం 15 మంది కూలీలు ఉండగా వారిలో 7 మందికి స్వల్ప గాయాలు కాగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన కుక్కమూడి ప్రభుదాస్‌ను గుంటూరు జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయాలైన దానమ్మ వైపాలెం ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పుల్లలచెరువు ఎస్ఐ సంపత్‌కుమార్‌ను వివరాలు కోరగా ఇప్పటికీ తమకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

త్రిపురాంతకం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చెరువులోకి దిగి నీటిలో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన మేడపిలో ఆదివారం జరిగింది. మేడపిలోని అన్నగారి చెరువలోకి వెళ్లిన తన గేదెలను బయటకు తోలేందుకు దిగిన నూతి సుబ్బయ్య (49) చెరువు మట్టిలో కూరుకుపోయి మునిగిపోయారు. దీనిని గమనించిన స్థానికులు చెరువులోకి దిగి అతనిని బయటకు తీసేటప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎస్సై శివబసవరాజు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్రిడ్జి రైలింగ్‌పైకి ఎక్కిన లారీ

తప్పిన పెనుప్రమాదం


బ్రిడ్జిపై వేలాడుతున్న లారీ

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం రైల్వే స్టేషన్ వద్ద ఓవర్ బ్రిడ్జిపై ఆదివారం తెల్లవారుజామున అదుపు తప్పి రైలింగ్‌ను టిప్పర్ లారీ ఢీకొట్టిన ఘటన జరిగింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణ నష్టం లేకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీమకుర్తి నుంచి పెద్దారవీడుకు కంకర లోడుతో టిప్పర్ లారీ వచ్చి అన్‌లోడ్ చేసి తిరిగి చీమకుర్తికి వెళుతుంది. ఈ క్రమంలో మార్కాపురం రైల్వే స్టేషన్ సమీపంలోని తెల్లవారుజామున ఓవర్ బ్రిడ్జి పైకి రాగానే కుడివైపు ఉన్న రైలింగ్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురై బయటకు వచ్చారు. లారీ డ్రైవర్ శ్రీనివాసులు, క్లీనర్‌తో కిందికి దిగారు. లారీ బ్రిడ్జి రైలింగ్ పైకి ఎక్కి కింద పడేలా వేలాడుతూ ఉండిపోయింది. బ్రిడ్జి పై బార్డర్‌లో ఉన్న స్లైప్ వలన లారీ కింద పడకుండా ఆగింది. బ్రిడ్జి కింద నివాసాలు కూడా ఉండడంతో వారంతా శబ్దానికి బయటకు పరుగు తీశారు. ఘటనా స్థలాన్ని రూరల్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న కమిటీ సభ్యులు

గ్రంథాలయంలో ఆటల పోటీలు

గిద్దలూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమంలో భాగంగా ఆదివారం త్రోబాల్ పోటీలను నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో ఉష, అనూష, జాహ్నవి, జూనియర్స్ విభాగంలో రస్వీర్, ఇందు, భవ్య మొదటి 3 స్థానాలు సాధించారు. గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్న బుజ్జమ్మ విజేతలకు సొంతంగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథపాలకురాలు ఎస్.ప్రసన్నకుమారి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి ఫరూఖ్, రిటైర్డ్ పంచాయతీ సెక్రటరీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు పండ్ల పంపిణీ

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్ఫూర్తి వెల్ఫేర్ దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. వాసవీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చంద్రసేన గుప్తా జయంతి వారోత్సవాలలో భాగంగా వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు క్లబ్ నాయకులు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు తెలిపారు. విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేశారు.

చంద్రగ్రహణంతో ఆలయాల మూత

నేడు సంప్రోక్షణ అనంతరం దర్శనాలు


చెన్నకేశవస్వామి ఆలయ తలుపులను మూసివేస్తున్న అర్చకులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చంద్రగ్రహణం సందర్భంగా మార్కాపురంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం ఆదివారం ఉదయం 11 గంటలకు మూసివేశారు. ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు. సోమవారం ఉదయం గ్రహణం అనంతరం దేవాలయ శుద్ధి, పుణ్యాహవాచనం, అభిషేక కార్యక్రమాల అనంతరం స్వామి వారి దర్శనం ఉంటుందని ఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయం సత్యనారాయణ స్వామి ఆలయం, ఆలమక లక్ష్మీనారాయణ స్వామి ఆలయం, తదితర ఆలయాలను గ్రహణం సందర్భంగా మూసివేశారు.

త్రిపురాంతకంలో..

త్రిపురాంతకం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): త్రిపురాంతకేశ్వరస్వామి దేవస్థానం ఉభయ ఆలయాలను ఆలయ సిబ్బందితో కలిసి అర్చక స్వాములు మూసివేశారు. ఆదివారం సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఉభయ ఆలయాల తలుపులను ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి మూసివేశారు. తిరిగి సోమవారం 6గంటల నుంచి ప్రాతఃకాల పూజ, ఆలయ శుద్ధి, ఆలయ సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతి ఇస్తామని ఆలయ కార్యనిర్వాహణాధికారి డీ అనిల్ కుమార్ తెలిపారు.


కోట సత్యమాంబ, పోలేరమ్మ

కోట సత్యమాంబకు మొక్కులు

కంభం : సర్వమతాల ఆరాధ్య దైవం కోట సత్యమాంబ దేవి ఆలయంలో ఆదివారం ఉదయం భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కంభం, అర్ధవీడు, బేస్తవారిపేట మండలాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మొక్కులు ఉన్నవారు కుంకుమ బండ్లు కట్టారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం చేశారు.

ఆలయం మూసివేత

ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్రగ్రహనం సందర్భంగా కోట సత్యమాంబ దేవి ఆలయాన్ని సాయంత్రం 4గంటలకు మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం ఆలయాన్ని తెరుస్తామని దేవస్థానం కమిటీ వారు తెలియజేశారు.

పోలేరమ్మ జాతర

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురం పట్టణ శి వారులలోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతరను వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు నివేదించారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం ఉదయం 11 గంటల నుంచి అమ్మవారి దర్శనం ని లిపివేశారు. సోమవారం ఉదయం సం ప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామని ఈవో తెలిపారు.

విద్యాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి


దోర్నాలలో సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయ సిబ్బంది

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధిపై ప్రభుత్వం ఎంతో శ్రద్ధ తీసుకుంటుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని విఠా సుబ్బరత్నం కల్యాణ మండపంలో మండలస్థాయిలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ, ఉపాధ్యాయినులను సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఉపాధ్యాయులను ఉద్దేశించి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లిదండ్రులకు రుణపడి ఉన్నామని, జన్మసార్థకతకు దారి చూపిన గురువులకు మరింత రుణపడి ఉందామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మెగా డీఎస్సీ ద్వారా 16450 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పని చేస్తున్న ఉపాధ్యాయులను 75శాతం ఉపాధ్యాయులను తెలుగుదేశం ప్రభుత్వం భర్తీ చేసిందని ఆయన గుర్తు చేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా సన్నబియ్యంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర ద్వారా ఉచిత యూనిఫామ్, బూట్లు, పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, మున్సిపల్ కమిషనర్ రమణబాబు, మండల విద్యాశాఖాధికారులు నాగభూషన్‌రెడ్డి, అశ్వనీకుమార్, బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయ నాయకులు టీకేఎస్ ప్రసాద్, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు ఆదర్శనీయం

పెద్ద దోర్నాల : అంకితభావంతో పని చేసి అందరి మన్ననలతో ఉత్తమ అవార్డులను పొందిన ఉపాధ్యాయుల సేవలు ఆదర్శనీయమని ఎంఈవో మస్తాన్ నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఆడిటోరియంలో ఉత్తమ అవార్డులు పొందిన ఉపాధ్యాయులను ఆదివారం ఘనంగా సన్మానించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా గోపాలయ్య, మండల ఉత్తమ అవార్డులు పొందిన కూచిపూడి వెంకయ్య, దాసరి సుధాకర్, గూడూరి సువర్ణ, కేవీ నారాయణమ్మ, బండ్లమూడి శ్రీనివాసులు షేక్ మహ్మద్ హనీఫ్‌ను ఎంఈవో ఉపాధ్యాయ సిబ్బంది శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిరణ్ కిశోర్ కుమార్, మహంత్ నాయక్, రామకృష్ణా నాయక్, ఎం వర్ధన్,కాశీరాములు,సొసైటీ అధ్యక్షులు బట్టు సుధాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు షేక్ మాబు, ఈదర మల్లయ్య పాల్గొన్నారు.

కళాశాల స్వర్ణోత్సవంలో పూర్వ విద్యార్థుల కలయిక


ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

పొదిలి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కళాశాల స్వర్ణోత్సవం సందర్భంగా 1976-78 పూర్వ విద్యార్థులు ఆదివారం జూనియర్ కాలేజీలో కలుసుకున్నారు. ప్రిన్సిపాల్ వాసుదేవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఆయా కాలేజీల్లో చదివిన విద్యార్థులందరూ అదే కళాశాల స్వర్ణోత్సవాల్లో కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అప్పటి అనుభూతును, జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సంతోషం వ్యక్తం చేశారు. ఆత్మీయ కలయికలో రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఎంఈవో, ఎస్ఐ కందుల వెంకటరెడ్డి, ఎం శ్రీరామ్మూర్తి, మహబూబ్ భాష, రిటైర్డ్ పీఈటీ దోర్నాల వరమ్మ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

142 మందికి వైద్య పరీక్షలు

పామూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నారాయణ మెడికల్ కాలేజి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం పామూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిబిరంలో 142 మందికి వైద్య పరీక్షలు చేశారు. 40 మందికి కంటికి సంబంధిత వైద్యం అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో వైద్యులతోపాటు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కొండలరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలి

పామూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని నివారించేలా జేవీవీ సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆసంఘం జాతీయ గౌరవాధ్యక్షుడు డాక్టర్ జె.నాగేశ్వర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన అవగాహన కార్యక్రమానికి జేవీవీ మండల అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ అధ్యక్షత వహించారు. నాగేశ్వర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావరణం దెబ్బతింటుందని అన్నారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసులు, బ్రహ్మజీ, షేక్ గయాజ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

కనిగిరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకుడు పీసీ కేశవరావు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలో పనిచేస్తున్న అదనపు సిబ్బందిని పని నుంచి తొలగించవద్దన్నారు. అనంతరం సీఐటీయూ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

పోరాటాలద్వారానే సమస్యల పరిష్కారం

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా నాయకుడు జీవీ కొండారెడ్డి అన్నారు. ఆదివారం జరిగిన సీఐటీయూ సీఎస్‌పురం మండల మహాసభకు రఫియా అధ్యక్షత వహించారు. కొండారెడ్డి మాట్లాడుతూ సీఐటీయూ బలోపేతానికి కార్మికులు కలిసిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఇరిగేషన్ భవనాలు

- పట్టించుకోని అధికారులు
- చోరీకి గురైన విలువైన కలప

పామూరు. సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనాలు ఆలనాపాలనాలేక శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం నివాసయోగ్యానికి కూడా నోచుకోని స్థితికి చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని మోపాడు రిజర్వాయర్ పరిరక్షణకు నియమితులైన ఉద్యోగుల కోసం అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం దొర బంగ్లాతో పాటు ఇరిగేషన్ అధికారులకు బంగ్లా, సిబ్బంది నివాసం ఉండేందుకు పలు క్వార్టర్స్‌లు నిర్మించారు. మోపాడు రిజర్వాయర్ ఆయకట్టు కింద పామూరు మండలంలో 9వేల ఎకరాలు, నెల్లూరు జిల్లాలోని కొండాపురం మండలంలో నాలుగు వేల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. ఆయకట్టు రైతులకు అందుబాటులో ఉంటూ పంటల సాగుపై సలహాలు, సూచనలు చేసేందుకు ఇంజనీర్‌లతో పాటు, లస్కర్లు నివాసం ఉండడానికి 120 సంవత్సరాల క్రితం భవనాలు నిర్మించారు. 30 సంవత్సరాల క్రితం మోపాడుకు వచ్చిన వరదలతో 118 మందికిపైగా మృత్యువాత పడ్డారు. రిజర్వాయర్ ఆనకట్ట పలుచోట్ల దెబ్బతింది. వరద ప్రభావం దాటికి ఇరిగేషన్ భవనాలు మరమ్మతులకు గురయ్యాయి.



డీఈ బంగ్లా చుట్టూ పెరిగిన చిల్లచెట్లు

దాంతో మోపాడు ఇరిగేషన్ కార్యాలయాన్ని కనిగిరికి తరలించారు. కిందిస్థాయి సిబ్బంది కూడా కనిగిరి, పామూరు నుంచి విధులు నిర్వర్తిస్తుండటంతో క్వార్టర్స్‌లో ఉండేవారు లేక నిరుపయోగంగా మారాయి. బ్రిటీష్ ప్రభుత్వం ఆయకట్టుదారుల ప్రయోజనాల కోసం నిర్మించిన ఆ భవనాల నిర్వహణను అధికారులు పట్టించుకోలేదు. ఈక్రమంలో భవనాలు పాడుపడి చిల్లచెట్లతో నిండిపోయాయి. ఈభవనాలకు సంబంధించిన కిటికీలు, ఇతర సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. జనసంచారం లేని ప్రదేశంగా మారడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారాయని స్థానికులు వాపోతున్నారు. జైకో నిధులు మంజూరైన మోపాడు ఆధునికీకరణ పనులు చేపట్టడంలో గత పాలకులు విఫలమయ్యారు. ప్రస్తుతం భవనాల పరిరక్షణకు అదనపు నిధులు మంజూరు చేయించి పూర్వవైభవం తీసుకురావాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు.



అధ్వానంగా సిబ్బంది క్వార్టర్స్

చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాల మూసివేత

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా సీఎస్‌పురం మండలంల ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి, భైరవకోన, చింతపూడు అభయాంజనేయస్వామి, పామూరులోని మదనవేణుగోపాల స్వామి, వల్లీభుజంగేశ్వర, సాయిబాబా, వాసవీమాత, సత్యదేవుని, రాములవారి దేవస్థానాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శన అవకాశాలు కల్పిస్తారని దేవస్థాన ఈవోలు తెలిపారు. నారాయణస్వామి దేవస్థానంలో ఈవో నరసింహబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పామూరు: మూసివేసిన నారాయణస్వామి దేవస్థానం

తాళ్లూరు: చంద్ర గ్రహణం సందర్భంగా మండలంలోని ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూసి వేశారు. గుంటిగంగ అమ్మవారి ఆలయాన్ని దేవదాయశాఖ ఆధ్వర్యంలో సిబ్బంది మధ్యాహ్నం 3గంటలకు మూసివేశారు. ఆదివారం గంగమ్మ తల్లికి ముఖ్యమైన రోజు కావటంతో కొందరు భక్తులు అమ్మవారిని దర్శించుకోలేక అసౌకర్యానికి గురయ్యారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ కార్యక్రమం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆలయాల అర్చకులు తెలిపారు.



తాళ్లూరు: మూసివేసిన గుంటిగంగ దేవస్థానం

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

- బిల్లులు లేకుండా నిల్వఉన్న పది టన్నుల డీఏపీ
- అమ్మకాలు నిలిపివేయాలంటూ ఆదేశించిన అధికారులు

పీసీపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియాను కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని భావించిన ప్రభుత్వం ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని విజిలెన్స్ పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ తదితర శాఖల అధికారులను ఆదేశించింది. ఇందులోభాగంగా కొద్దిరోజులుగా వివిధ శాఖల అధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. పీసీపల్లిలో వీరవెంకటరమణ ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, వెంకట కామాక్షి ట్రేడర్స్‌లను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో వీర వెంకటరమణ ఫెర్టిలైజర్స్ గోడౌన్‌లో కొనుగోలు పత్రాలులేని 10.2టన్నుల డీఏపీని గుర్తించారు. నిల్వ ఉన్న డీఏపీకి సంబంధించిన కొనుగోలు బిల్స్ చూపించమని విజిలెన్స్ సీఐ రాఘవరావు దుకాణ యజమానిని కోరారు. బిల్స్ కనిపించడం లేదని దుకాణ యజమాని అధికారులకు చెప్పాడు. డీఏపీ కొనుగోలుకు సంబంధించిన బిల్స్ తమకు చూపించేవరకు విక్రయించవద్దని ఆదేశించారు. బిల్లులు లేకుండా నిల్వ ఉంచిన డీఏపీ విలువ రూ.2.7లక్షలు ఉంటుందని ఏవో రంగాక్రిష్ణ తెలిపారు.



ఎరువుల బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

ఈసందర్భంగా విజిలెన్స్ సీఐ రాఘవరావు మాట్లాడుతూ రైతులకు యూరియాను అందుబాటులో ఉంచాలని దుకాణ యజమానులను ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా కృత్రిమ కొరత సృష్టించి యూరియాను బ్లాక్‌లో విక్రయిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఎమ్మార్పీ రేట్లకంటే అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దాడుల్లో విజిలెన్స్ సీఐతో పాటు ఏవో శివనాగప్రసాద్, పీసీపల్లి ఏవో ఎన్.రంగాక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగాలో ప్రతిభ చాటిన విద్యార్థులు

పీసీపల్లి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీలలో మండలంలోని వెంగళాయపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈనెల 6,7తేదీలలో పశ్చిమగోదావరి జిల్లా ద్వారకాతిరుమలలో యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొన్నారు. సీహెచ్ మానస, జశ్వంత్‌లు వివిధ భంగిమల్లో యోగాసనాలు ప్రదర్శించి ప్రతిభ చాటారు. విజేతలుగా నిలిచిన వీరిరువురిని మండల విద్యా శాఖాధికారులు జి.సంజీవి, ఆర్.శ్రీనివాసులు, విద్యా కమిటీ చైర్మన్ వీరాంజనేయులు అభినందించారు.



చక్రాసనంలో మానస

పెరిగిన సైబర్ నేరాలు

- బెంబేలెత్తుతున్న బాధితులు
- మోసపోతున్న యువత

ముండ్లమూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాలకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, సామాన్య రైతులు సైబర్ నేరగాళ్ళ చేతుల్లో మోసపోతున్నారు. లక్షల రూపాయలు పోగొట్టుకొని లబోదిబోమంటున్నారు. కొందరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. మరి కొందరు ఎవరికి చెప్పుకోలేక మధనపడుతున్నారు. సైబర్ నేరగాళ్ళు సులువగా యువతను వలలో వేసుకుంటున్నారు. ఈఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు దాదాపు యాభై మందికిపైగానే సైబర్ నేరగాళ్ళ చేతుల్లో మోసపోయారు.

మండలంలోని పసుపుగల్లు గ్రామానికి చెందిన ఒక యువకుడు రూ.10 లక్షలు సైబర్ నేరగాళ్ళ చేతిలో చిక్కి పోగొట్టుకున్నాడు. మారెళ్ళకు చెందిన ఓఉద్యోగి సతీమణి రూ.3.81 లక్షలు పోగొట్టుకున్నారు. ఓ ఉపాధ్యాయుడు సైబర్ నేరగాళ్ళ చేతిలో చిక్కి రూ. 5.18 లక్షలు పోగొట్టుకున్నారు. పెదఉల్లగల్లుకు చెందిన ఇద్దరు రూ.60 వేలు, రూ. 3.20 లక్షలు పోగొట్టుకున్నారు. ఉమామహేశ్వర అగ్రహారంకు చెందిన వ్యక్తి రూ. 98 వేలు పోగొట్టుకున్నాడు. వీరుకాక పసుపుగల్లుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి రూ.లక్ష, మరో యువకుడు రూ.50వేలు, ఇంకొకరు రూ.40వేలు పోగొట్టుకున్నారు. ఉల్లగల్లులో 11 మంది సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడి లక్షలాది రూపాయలు కోల్పోయారు. మిగతా గ్రామాల్లోనూ బాధితులు ఉన్నారు.

డబ్బులు పోగొట్టుకున్న కొంతమంది సెల్‌కు వచ్చిన ఓటీపీ చెప్పటంతో సైబర్ నేరగాళ్ల వారి అకౌంట్‌ల్లో ఉన్న డబ్బులను బదిలీ చేసుకున్నారు. మరికొంతమంది సెల్ ఫోన్‌కు టెలిగ్రామ్ రావడంతో రేటింగ్ చూసుకొని అత్యాశకు పోయి లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారు. ప్రధానంగా చదువుకుంటున్న యువతను లక్ష్యంగా చేసుకొని కేటుగాళ్ళు వారి ఫోన్‌లకు మెసేజ్‌లు పంపి చాటింగ్ చేస్తారు. తొలుత కొంత నగదు పంపి, ఆతర్వాత వారినుంచి ఎక్కువ మొత్తంలో డబ్బులు లాగటం పరిపాటై పోయింది. మరికొంతమంది యువకులైతే కళాశాలలకు ఫీజులు కట్టడానికి తీసుకెళ్లి నేరగాళ్ళ ఉచ్చులో పడి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. అటు కళాశాల ఫీజు కట్టలేక, ఇటు తల్లిదండ్రులకు సమాధానం చెప్పలేక ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి సైబర్ నేరగాళ్ళ భరతం పట్టకపోతే ఎంతోమంది వీరి వలలో చిక్కుకుని మోసపోయే ప్రమాదం ఉంది.

సైబర్ నేరగాళ్ళ మాయలో పడొద్దు

- ఎస్ఐ కమలాకర్



సైబర్ నేరగాళ్ళ పట్ల అప్రమత్తంగా ఉండాలి. సెల్ ఫోన్‌లకు మెసేజ్‌లు వచ్చినా, ఓటీపీ చెప్పమన్నా, బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నాం.. పాసుబుక్‌కు ఆధార్ లింకు కాలేదని చెప్పినా వారికి తెలపొద్దు. అవసరమైతే బ్యాంక్ అధికారులను సంప్రదించాలి. ఇటీవల మండలంలో సైబర్ నేరగాళ్ళ చేతుల్లో మోసపోయిన బాధితుల నుంచి తమకు ఫిర్యాదులు వస్తున్నాయి.

ఐకమత్యంగా ముందుకు సాగాలి

తాళ్లూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): హిందువులంతా ఐకమత్యంగా ముందుకు సాగాలని విశ్వహిందూపరిషత్ స్వచ్ఛంద ప్రముఖ్ సుబ్బారావు అన్నారు. తాళ్లూరులోని కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో ఆదివారం జరిగిన విశ్వహిందూపరిషత్ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మబంధాలు దూరమైతే ప్రజల్లో అజ్ఞానం పెరిగి సమాజం నష్టపోతుందన్నారు. హిందూ ధర్మాన్ని గురించి ప్రచార్‌లు ప్రజల్లో అవగాహన కల్గించి సనాతన ధర్మాన్ని కాపాడాలన్నారు. ముందుగా గ్రామంలో శ్రీ రామస్వామి నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రచార ప్రముఖ్‌లు చందోలు రామారావు, శ్రీనివాసనందస్వామి, శివశంకర్, చందోలు శివ, రాధాకృష్ణ, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసులు, బలరామ్, నగేష్‌బాబు, సాంబిరెడ్డి, పెరుమాళ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్బారావు

గంగమ్మకు ప్రత్యేక పూజలు

తాళ్లూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. తాళ్లూరుతో పాటు వివిధ ప్రాంతాలనుంచి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు రావటంతో ప్రాంగణం సందడిగా మారింది. ఆలయ అర్చకపూజారి ఎన్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు, దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌వి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

వైభవంగా పోలేరమ్మ కొలుపులు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ అమ్మవారు

ముండ్లమూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయుడుపాలెంలో ఐదు దశాబ్దాల తరువాత పోలేరమ్మ కొలుపులు నిర్వహించారు. ఐదు రోజుల పాటు జరిగిన కొలుపుల్లో భాగంగా చివరి రోజు శనివారం అమ్మవారికి మొక్కుబడి ప్రభలు ఏర్పాటుచేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. చివరి రోజైన శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారు జాము వరకు మొక్కుబడి ప్రభలు ఏర్పాటుచేసుకొని ఊరేగింపులు నిర్వహించారు. ఆదివారం కూడా పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల యువకులు, చదువున్న ఉద్యోగులు పక్క గ్రామాల్లో జరుగుతున్న కొలుపుల ఉత్సవాలను చూసి ఒక తాటిపై వచ్చి ఐదు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు.

పరిటాల రవి స్మృతివనాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ఉగ్ర



పరిటాలరవి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, మంత్రి గొట్టిపాటి రవికుమార్

కనిగిరి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): అనంతపురం సమీపంలోని పరిటాల రవి స్మృతి వనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ పార్టీ ప్రముఖులతో కలసి ఆదివారం సందర్శించారు. అనంతపురంలో జరగనున్న టీడీపీ సభ ఏర్పాట్ల పర్యవేక్షణకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డిని నియమించారు. దీంతో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర శుక్రవారం నుంచి అనంతపురంలో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈసందర్భంగా అనంతపురంలో ఉన్న ప్రముఖులతో కలసి స్మృతి వనంలోని పరిటాల రవి ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం విద్యుత్ శాఖ ఏఈగా ఎల్.రమేష్ బాధ్యతలు స్వీకరించారు. పర్చూరులో జూనియర్ ఇంజనీర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో కనిగిరి ఈఈ ఉమాకాంత్, పామూరు ఏడీఈ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పల్లె వెలుగు' చూడని గ్రామాలు

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- విద్యార్థులకు తప్పని ఆటో ప్రయాణం

దొనకొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పల్లెవెలుగు బస్సులు గత కొన్ని సంవత్సరాలుగా మండలంలోని పలు గ్రామాలకు రావడంలేదు. ప్రస్తుతం ఆర్టీసీ బస్సులు దొనకొండ నుంచి దర్శి మీదుగా ఒంగోలు, దొనకొండ నుంచి కొచ్చెర్లకోట మీదుగా ఎర్రగొండపాలెంకు తిరుగుతున్నాయి. అవికూడా ఒకటి రెండు బస్సులు దొనకొండ - పొదిలి ప్రధాన రహదారుల్లో మాత్రమే రాకపోకలు జరుపుతుండటంతో కొన్ని గ్రామాల ప్రజలకే బస్సు ప్రయాణ సౌకర్యం లభిస్తుంది. దొనకొండ నుంచి మార్కాపురం, ప్రముఖ బౌద్ధక్షేత్రమైన చందవరం మీదుగా త్రిపురాంతకం, కురిచేడు మీదుగా వినుకొండకు వెళ్లే మార్గంలో పలు గ్రామాలకు తారురోడ్డు సౌకర్యం ఉన్నా బస్సులు తిరగడంలేదు. దీంతో ప్రజలు ఆటోలలో రాకపోకలు జరుపుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పలు గ్రామాల విద్యార్థులు మండలకేంద్రమైన దొనకొండలోని పాఠశాలలు, కాలేజీలకు రాకపోకలు జరుపుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో దొనకొండ నుంచి జిల్లా కేంద్రమైన ఒంగోలుకు ఉదయం, సాయంత్రం తిరిగే బస్సును ఆర్టీసీ అధికారులు రద్దు చేయటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు.



దొనకొండ నుంచి పొదిలి వెళ్తున్న ఆర్టీసీ బస్సు

కూటమి ప్రభుత్వం స్త్రీశక్తి పథకంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం మండలంలోని పలు గ్రామాలకు ఉండటంలేదు. బాదాపురం, ఎర్రబాలెం, రామిరెడ్డిపల్లి, పోలేపల్లి, కందులవారిపల్లి, చందవరం, బట్టిపాడు, లక్ష్మీపురం, రామాపురం, ఇండ్లచెరువు, వెంకటాపురం, రాగమక్కపల్లి, భూమనపల్లి, మల్లంపేట, మంగినపూడి, సిద్దాయిపాలెం, అనంతవరం, వద్దిపాడు, సంగాపురం, పీకంభంపాడు తదితర గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. ఏళ్ల తరబడి ఆటోలలో, ఇతర ప్రైవేట్ వాహనాల్లో రాకపోకలు జరుపుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులకు మండల సర్వసభ్య సమావేశాల్లో ఎన్నోసార్లు విన్నవించుకున్నా ఫలితం లేదు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి తారురోడ్డు సౌకర్యం ఉన్న గ్రామాలకైనా ఆర్టీసీ బస్సులను ఏర్పాటుచేసి తమ ప్రయాణ ఇక్కట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.




వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొయిన్

బంగారమని టోకరా.. ఏడుగురి అరెస్టు

1 బాధితుడు.. నిందితులు కర్నాటకకు చెందిన వారే 1 చీరాలకు రప్పించి రూ.14 లక్షలు దోపిడీ

చీరాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బంగారం పేరిట టోకరా వేయగా గంటల వ్యవధిలోనే నిందితులను పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనలో బాధితుడు, నిందితులు కర్నాటక రాష్ట్రానికి చెందిన వారే కావడం విశేషం. ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 14 లక్షలు నగదు, సెల్‌ఫోన్లు, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఆదివారం ఈపూరుపాలెం పోలీస్‌స్టేషన్‌లో మీడియా ఎదుట హాజరుపరిచిన డీఎస్పీ ఎండీ మొయిన్ వివరాలు వెల్లడించారు. కర్నాటక రాష్ట్రం శివమొగ్గ జిల్లా దొడ్డపేటకు చెందిన స్వర్ణకారుడు యూవీ నాగరాజుతో ముందస్తు పథకం ప్రకారం అదే రాష్ట్రం గంగావతి ప్రాంతానికి చెందిన సాతుపాటి యువరాజు పరిచయం చేసుకున్నాడు. ఈ క్రమంలో చీరాల ప్రాంతంలో తనకు తెలిసిన వారి నుంచి తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తానని నాగరాజును నమ్మించాడు. యువరాజు మాటలను నిజమేనని నమ్మిన స్వర్ణకారుడు గత నెల 20న చీరాలకు వచ్చి శాంపిల్‌గా ఓ ఆభరణం చూసుకుని వెళ్లాడు. బంగారం కొనేందుకు అన్న నాగాంజితో కలిసి శనివారం చీరాలకు రాగా వారిని నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకువెళ్లాడు. అప్పటికే అక్కడ పోలీసుల వేషధారణలో ఉన్న గంగావతికి చెందిన శశికుమార్, నాగరాజు, కిశోర్‌కుమార్, రవికుమార్, హరీష్, మురళీకృష్ణలతో కలిసి యువరాజు నాగరాజు, నాగాంజిలపై దాడి చేసి రూ.14 లక్షలు, రెండు సెల్‌ఫోన్లు లాక్కుని కారులో పరారయ్యారు. దీంతో దిక్కుతోచని స్థితిలోకి చేరిన సోదరులు సమీపంలోని ఈపూరుపాలెం పోలీసులను ఆశ్రయించారు. దీంతో డీఎస్పీ మొయిన్ ఆదేశాలతో రూరల్ సీఐ శేషగిరిరావు పర్యవేక్షణలో నిందితులను ఫోన్ నెంబర్ల ఆధారంగా ప్రకాశం జిల్లా దోర్నాలలో ఎస్ఐ చంద్రశేఖర్ అదుపులోకి తీసుకున్నారు.

గ్రహణంతో ఆలయాల మూత

గ్రహణశుద్ధి అనంతరం నేటి ఉదయం నుంచి దర్శనాలు


అమరావతి : మూతపడిన అమరేశ్వరస్వామి దేవస్థాన రాజగోపురం తలుపులు

బాపట్ల, అద్దంకి, కోటప్పకొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా జిల్లాలోని ప్రధాన ఆలయాలతో స్థానికంగా ఉన్న ఆలయాలను మూసేశారు. స్వామి అమ్మవార్లకు నివేదన అనంతరం ఆదివారం మధ్యాహ్నం అర్చకులు, ఆలయ సిబ్బంది, అధికారుల సమక్షంలో ఆలయాల గర్భాలయాలతో పాటు ప్రధాన ద్వారాలకు తాళాలు వేశారు. గ్రహణం విడిచాక శుద్ధి, పుణ్యాహ వచనం చేసి నిత్యసేవలను ఏకాంతంగా నిర్వహిస్తారు. ఆ తర్వాత సోమవారం ఉదయం నుంచి స్వామి, అమ్మవార్ల దర్శనాలకు భక్తులను అనుమతిస్తామని అర్చకులు, అధికారులు ప్రకటించారు.

1 ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి వారికి సోమవారం ఉదయం 9 గంటల నుంచి నిత్య అభిషేకాలు, కైంకర్యాలు యథావిధిగా జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్ తెలిపారు.

1 బాపట్లలో చారిత్రక ప్రసిద్ధిగాంచిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీరభావన్నారాయణస్వామి, శ్రీ సోమేశ్వరస్వామి తదితర దేవాలయాల్లో గ్రహణ శుద్ధి అనంతరం తెరవనున్నట్లు అర్చకులు తెలిపారు.

1 శింగరకొండలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో లక్ష తమలపాకుల పూజ అనంతరం అర్చకులు అన్ని ద్వారాల వద్ద దర్భలు ఉంచి మూసేశారు. సోమవారం సంప్రోక్షణ అనంతరం అభిషేకం, పూజలు నిర్వహిస్తామని వేదపండితులు హరి శంకరావధాని, ప్రధాన పూజారి లక్ష్మీనారాయణ, ఈవో తిమ్మానాయుడు తెలిపారు. శింగరకొండలోని కొండపైన ఉన్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం ఉదయం 6 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం ఉంటుందని ఈవో శ్రీనివాసరావు తెలిపారు.


పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థాన ప్రధాన ద్వారానికి తాళాలు వేస్తున్న అర్చకులు


బాపట్ల : మూసివేసిన శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీరభావన్నారాయణస్వామి దేవాలయం


నరసరావుపేట : కోటప్పకొండ ఆలయం..



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం దక్షిణ రాజగోపురం ద్వారం మూస్తున్న పూజారులు

వెంకన్న వైభోగం

1 రూ.107 కోట్లతో టీటీడీ ఆలయ విస్తరణ
1 మూడు ప్యాకేజీలుగా పనులకు టెండర్లు
1 మలిదశలో రూ.50 కోట్లతో మౌలిక సదుపాయాలు

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

ఏపీ రాజధాని అమరావతిలో వెంకన్న వైభోగం పరిఢవిల్లనున్నది. అమరావతిలో తిరుమలను సాక్షాత్కరింపజేయాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష నెరవేరనున్నది. ఈ దిశగా వెంకటపాలెంలో ఆలయాభివృద్ధికి టీటీడీ చర్యలు తీసుకుంటోంది. గత టీడీపీ ప్రభుత్వం 25 ఎకరాల విస్తీర్ణంలో రూ.150 కోట్లతో దివ్యమందిర నిర్మాణానికి 2019 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం దానికి తూట్లు పొడిచి కేవలం రూ.30 కోట్లతో మమ అనిపించేలా ఆలయాన్ని నిర్మింపచేసింది. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వెంకన్న ఆలయ నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఏడేళ్ల క్రితం అనుకున్నదానికన్నా మిన్నగా మరింత అద్భుతంగా ఆలయ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. రూ.185 కోట్లతో ఆలయ విస్తరణ పనులను చేపడతామని గత మార్చిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆలయాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ కోసం డీపీఆర్ తయారుచేయించి ఆ ప్రకారం విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతానికి రూ.107.54 కోట్లతో వెంకటపాలెంలో వెంకన్న ఆలయ విస్తరణ పనులను చేపడుతున్నారు. ఈ పనులకు సంబంధించి మూడు వేర్వేరు టెండర్లను టీటీడీ తాజాగా పిలిచింది. త్వరలో యాత్రికుల సౌకర్యార్థం రూ.50 కోట్లకు పైగా వ్యయంతో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కూడా టీటీడీ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ఇందులో అన్నదాన భవనం, అర్చకులు, సిబ్బంది నివాసగృహాలు, భక్తుల కోసం (మిగతా 8లో)


మాస్టర్‌ప్లాన్ ప్రకారం వెంకటపాలెంలో శ్రీనివాసుని ఆలయ సుందర దృశ్యం

ప్యాకేజీలు.. పనులు

తొలి ప్యాకేజీ: రూ.36.99 కోట్లతో ఏడంతస్తుల మహారాజగోపురం, అద్దాల మండపం, ఆర్జిత సేవా మండపం, వాహనశాల, రాథ మండపం, ఆంజనేయస్వామి మందిరం, కల్యాణ పుష్కరిణి, లోపలి, వెలుపలి ప్రాకారాలలో ఫ్లోరింగ్ పనులను చేపడతారు.

రెండో ప్యారేజీ: రూ.35.20 కోట్లతో దక్షిణప్రాంత మాడవీధి, అప్రోచ్ రోడ్లు, ఉత్సవ, కల్యాణోత్సవ మండపాలు, వెలుపలి దక్షిణ ప్రాకారం, ఐదంతస్తుల గోపుర నిర్మాణాలను చేపడతారు.

మూడో ప్యాకేజీ: రూ.35.35 కోట్లతో వెలుపలి ఉత్తర ప్రాకారం, మరో ఉత్సవ మండపం, ఉత్తరం వైపు మాడవీధి, రెండు గోపుర నిర్మాణాలను(ఐదంతస్తులు) చేపడతారు.

రియల్టర్ల బరితెగింపు

ఏకంగా పంట కాల్వల ధ్వంసం
పేట్రేగుతున్న అనధికార లేఅవుట్లు

చీరాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రియల్టర్లు బరితెగిస్తున్నారు. ఏకంగా అక్కయ్యపాలెం పంపింగ్ స్కీం పరిధిలోని పంట కాల్వను సైతం పగలకొట్టేశారు. తమ లేఅవుట్లలో దారికి అనుగుణంగా పైపులు వేసుకున్నారు. కొంతమంది రైతులు అడ్డం తిరగడంతో వెనుతిరిగారు. ఇదే పరిస్థితి నియోజకవర్గవ్యాప్తంగా నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో చెలరేగిన ట్లుగానే ప్రస్తుతం కూడా అక్రమ లేఅవుట్లతో రియల్టర్లు చెలరేగిపోతున్నారు. దీంతో వాడరేవు, రామాపురం, కొత్తపేట, అక్కయ్యపాలెం, చల్లా రెడ్డి పాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, పాపాయిపాలెం, తోటవారిపాలెం, జాతీయ రహదారి వెంబడి ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా లే అవుట్లు వెలిశాయి. కొంతమంది అధికారులను బుట్టలో వేసుకుని రియల్టర్లు అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. పంట పొలాలు, అసైన్డ్, పట్టా భూములను కొనుగోలు చేసి అనుమతులు తీసుకోకుండా దర్జాగా వెంచర్లు వేస్తున్నారు. అంతర్గత రహదారులు అందంగా చూపి ప్రజలకు ఎర వేస్తున్నారు. ఇటీవల కాలంలో ఈ తరహా విష సంస్కృతి నియోజక వర్గంలో తారాస్థాయికి చేరింది. ఎక్కడపడితే అక్కడ అనధికార లేఅవుట్లు ఏర్పడుతున్నా అధికారులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. తప్పదనకుంటే నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. కొంత మంది కన్వర్షన్ చార్జీలు చెల్లిస్తున్నా పంచాయతీ అనుమతులను గాలికి వదిలేస్తున్నారు. కొన్నిచోట్ల రోడ్డు మార్జిన్లు, వాన్‌పిక్ భూముల ఆక్రమణలు కూడా జరుగుతున్నాయి. సీలింగ్ ల్యాండ్‌లు కూడా కొంతమంది బడాబాబులు చెరలోకి చేరాయి.


లే అవుట్ నిర్వాహకులు పగలకొట్టిన అక్కయ్యపాలెం పంపింగ్ స్కీం పరిధిలోని పంట కాల్వ


రామాపురం రోడ్డులోని అనధికార లే అవుట్

ప్రభుత్వ విధానాలతో వెనుకబడిన విద్యారంగం

యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు

బాపట్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విధానాలతో విద్యారంగం వెనుకబడి పోతున్నదని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు తెలిపారు. యూటీఎఫ్ జిల్లాశాఖ మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆదివారం స్థానిక ఎన్జీవో హోమ్‌లో జిల్లా అధ్యక్షుడు జడ వినయ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించకుండా ఉపాధ్యాయులను దోషులుగా చిత్రీకరించే పని జరుగుతుందన్నారు. పర్యవేక్షణ వ్యవస్థలో శాశ్వత నియామకాలు లేవన్నారు. బదిలీలు, ఉద్యోగోన్నతులు జరిగి మూడునెలలైనా పలువురు ఉపాధ్యాయులు పాతస్థానాల్లోనే కొనసాగుతున్నారన్నారు. యోగాంధ్ర, మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ పేరిట బోధనకు ఆటంకం కలిగిందన్నారు. బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయులను తిప్పుతున్నారన్నారు. 12వ పీఆర్సీ కమిషన్, ఐఆర్ ప్రకటించలేదని, 4 డీఏలు ఇవ్వలేదని తెలిపారు. సీపీఎస్ విషయంలో కేంద్రం ఆదేశాలను సైతం అమలు చేయలేదన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో 15 నుంచి 19వ తేదీ వరకు రణభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు, కోశాధికారి ఎం.వెంకటేశ్వరరెడ్డి, ఏఎస్వీ సంజయ్, గేరా సురేష్, సి.హెచ్.ప్రభాకర్, ఆర్.ఆంజనేయులు, పాపారావు, బిక్షాలబాబు తదితరులు పాల్గొన్నారు.



యూటీఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు తదితరులు

డ్వాక్రాలకు.. డ్రోన్లు



1 సాగులో సంఘాల భాగస్వామ్యం 1 నమోదీదీ పథకం ద్వారా ప్రోత్సాహం 1 రాయితీపై డ్రోన్లు అందించనున్న ప్రభుత్వం 1 మహిళలకు ఆదాయం పెంచే దిశగా చర్యలు
1 తొలి దశలో మూడు జిల్లాల్లో 200 వరకు ఆమోదం
1 మండలానికి రెండు సంఘాలకు అందించేలా కార్యాచరణ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సాగు.. సాంకేతికతను సంతరించుకుంటోంది. సంప్రదాయ వ్యవసాయ విధానాన్ని యంత్రాల వినియోగంతో ఆధునిక వ్యవసాయం అధిగమించింది. కూలీల కొరత.. కూలి భారాల్ని తగ్గిస్తూ కొత్త పుంతలు తొక్కుతోంది. ఈ క్రమంలో వ్యవసాయంలో డ్రోన్ల వాడకాన్ని విరివిగా పెంచడానికి ఇప్పటికే ప్రభుత్వం పక్కా ప్రణాళికతో అడుగులేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే గ్రామాల్లో రైతు గ్రూపులకు రాయితీపై డ్రోన్లు పంపిణీ చేపట్టింది. వీటిని మరింతగా ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్రం సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టగా ఇందులో రాష్ట్రం కూడా ఇతోధికంగా సాయం అందించనుంది. యాంత్రీకరణను ప్రోత్సహించడంతో పాటు ఇందులో డ్వాక్రా సంఘాలకు కూడా భాగస్వామ్యం కల్పించాలనే ఉద్దేశంతో కేంద్రం నమోదీదీ పథకానికి అంకురార్పణ చేసింది. డ్వాక్రా సంఘాలకు కానీ వ్యక్తిగతంగా మహిళలకు రాయితీపై డ్రోన్లు అందించి వారి ఆదాయ మార్గాలను మెరుగుపరచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందుకు సంబంధించి డ్వాక్రా సంఘాలను దరఖాస్తులు ఆహ్వానించే ప్రక్రియ రెండు నెలల క్రితమే డీఆర్‌డీఏ మొదలు పెట్టింది. తొలి దశలో భాగంగా మండలానికి కనీసం రెండు సంఘాలకు డ్రోన్లు అందించేలా కార్యాచరణ రూపొందించింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దాదాపు 400 దరఖాస్తులు రాయితీ డ్రోన్ల కోసం డ్వాక్రా సంఘాల మహిళల నుంచి రాగా నిబంధనల ప్రకారం 200 మంది అర్హత సాధించారు. వీరందరికీ త్వరలోనే రాయితీపై డ్రోన్లు (మిగతా 8లో)

80 శాతం రాయితీ.. రూ.2 కోట్ల లబ్ధి

రాయితీపై అందించే ఒక్కో డ్రోన్ వ్యయం దాదాపు రూ.10.50 లక్షలు కాగా ఇందులో 80 శాతం రాయితీ నమోదీదీ పథకం ద్వారా డ్వాక్రా సంఘాలకు అందనుంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో 200 డ్రోన్లను తొలి దశలో అందించడానికి కసరత్తు చేస్తున్నారు. రాయితీ ద్వారా డ్వాక్రా సంఘాలకు రూ.2 కోట్ల వరకు లబ్ధి అందనుంది. రెండేళ్ల వ్యవధిలో మూడు జిల్లాల పరిధిలో కనీసం 10,000 డ్వాక్రా సంఘాలను నమోదీదీ పథకం రాయితీ ఫలాలు అందనున్నాయి. ఈ మేరకు డీఆర్‌డీఏకు ఆదేశాలు అందినట్లు సమాచారం.

ఎరువుల కొరత లేదు

● రైతులు ఆందోళన చెందవద్దు ● కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఎరువుల కొరత ఏమాత్రం లేదని రైతులు ఈ విషయంలో ఆందోళన చెందవద్దని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఈ విషయమై ఆదివారం ఆయన రెవెన్యూ, అగ్రికల్చర్, పోలీసు అధికారులతో ఎస్పీ తుషార్ డూడితో కలిసి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ఎరువుల పంపిణీ సమయంలో వ్యవసాయశాఖ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌కు సరిపడ స్టాక్ అందుబాటులో ఉందన్నారు. జిల్లాకు ఈనెల 12వ తేదిలోపు మరో 6వేల టన్నుల యూరియా అదనంగా రానుందన్నారు. యూరియా కావాల్సిన రైతులకు ఏరియావైజ్‌గా టైమ్ స్లాట్ కేటాయించాలని సూచించారు. ఎరువుల పంపిణీ కేంద్రాలలో రైతుల కోసం షామియానాలు, మంచినీళ్ళు, కుర్చీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతుల వివరాలను తప్పనిసరిగా ఐఎఫ్ఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 16 వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ జరిగిందన్నారు. రైతులకు కావాల్సిన స్టాక్ అందుబాటులో ఉందన్నారు. రైతుల కోసం కలెక్టర్ కార్యాలయంలో 8247040131 ఫోన్‌నెంబర్‌ను అందుబాటులో ఉంచామన్నారు. ఎరువులు ఎంఆర్‌పీ ధర కంటే ఎక్కువగా అమ్మితే కాల్‌సెంటర్‌కి ఫిర్యాదు చేయాలన్నారు. ఆవిధంగా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రతి ఒక్కరికి ఎరువులు సరఫరా చేస్తాం : ఆర్డీవో

బాపట్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సాగు చేస్తున్న ప్రతి రైతుకు ఎరువులు అందిస్తామని ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం మరుప్రోలువారిపాలెం రైతుసేవాకేంద్రాన్ని ఆర్డీవో సందర్శించారు. అక్కడ రైతులకు అందజేస్తున్న ఎరువుల పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఎరువులు అందించే విధంగా చర్యలు చేపడుతామన్నారు. అదేవిధంగా తూర్పుబాపట్లలో ఎరువుల స్టాక్‌ను ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్ తనిఖీ చేశారు. రైతులు ఇబ్బంది పడాల్సిన పనిలేదన్నారు. అందరికి ఎరువులు అందించేలా ప్రభుత్వం అన్నివిధాలా కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ సలీమా, వ్యవసాయాధికారిణి కె.శారద, జిల్లా వ్యవసాయశాఖాధికారి అన్నపూర్ణ పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

అగ్నిమాపక శాఖ కానిస్టేబుల్ ఓవర్‌యాక్షన్

అద్దంకి, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): అద్దంకి వ్యవసాయ మార్కెట్‌యార్డ్ ఆవరణలో నిర్వహించే అన్నగారి సంతలో అగ్నిమాపక శాఖ కానిస్టేబుల్ ఓవర్‌యాక్షన్ విమర్శలకు తావిచ్చింది. స్థానికుల కథనం మేరకు ఆదివారం అన్నగారి సంత నిర్వహిస్తున్న ఈ క్రమంలో కొనుగోలుదారులు మోటార్‌సైకిళ్లను మార్కెట్‌యార్డు కార్యాలయం ముందు పార్కింగ్ చేస్తుంటారు. అదే భవనంలో అగ్నిమాపక కార్యాలయం కూడా నిర్వహిస్తుంటారు. అయితే వారు పార్కింగ్ చేయకుండా అడ్డుగా తాడు కట్టారు. అప్పటికే పలువురు మోటార్‌సైకిల్స్ పార్కింగ్ చేసి ఉంచటంతో 4వ వార్డు కౌన్సిలర్ భర్త మాగులూరి గోపి కూడా మోటార్‌సైకిల్ పార్కింగ్ చేసే ప్రయత్నం చేశారు. దీంతో మోటార్‌సైకిల్ పార్కింగ్ చేయరాదని అగ్నిమాపక శాఖ కానిస్టేబుల్ అడ్డుకున్నారు. అప్పటికే మోటార్‌సైకిళ్లు పార్కింగ్ చేసి ఉన్నాయి కదా అని గోపి అన్నారు. దీంతో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగింది. మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులు వచ్చి వారించినా అగ్నిమాపక శాఖ కానిస్టేబుల్ వెనక్కు తగ్గకుండానే గోపీని దుర్భాషలాడడం మరింత విమర్శలకు తావిచ్చింది. ఈ విషయమై అగ్నిమాపక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు గోపి తెలిపారు.

పురుగుమందు తాగిన వ్యక్తి మృతి

బోయినవారిపాలెం(చీరాల), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మనస్థాపంతో పురుగుల మందు తాగిన వ్యక్తి విజయవాడలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈపూరుపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మల్లవరపు విజయ సారధి(45) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో గత నెల 24న శివారు ప్రాంతంలో పురుగుల మందు తాగాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు విజయవాడలో చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. భార్య శ్రీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

రామన్నపేట(చీరాల), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం రామన్నపేటలో పేకాట స్థావరంపై వేటపాలెం ఎస్సై జనార్ధన్ దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుండి రూ. 2580 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

వేటపాలెం(చీరాల), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం కొత్త కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈమేరకు పోలీసులు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడు రంగుల గడుల చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదెలు మృతి

● కారంచేడు ప్రధాన రహదారిలో ఘటన

కారంచేడు (పర్చూరు), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు - చీరాల రోడ్డులోని స్థానిక శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు గేదెలు మృతి చెందాయి. అయితే ఆ గేదెలు ఎవరివనేది తెలియరాలేదు. ప్రమాదానికి కారణమైన వాహనం విషయాలు తెలియాల్సి ఉంది. అతివేగమే పశువుల మృతికి కారణమని స్థానికులు అంటున్నారు.

డ్వాక్రాలకు.. డ్రోన్లు

(5వ పేజీ తరువాయి)

అందించడానికి డీఆర్‌డీఏ కసరత్తు చేస్తోంది. మొదటి దశలో భాగంగా ఇచ్చే ఈ డ్రోన్లను ఈ నెలాఖరుకు జిల్లాలకు చేరనున్నాయి. దశల వారీగా ప్రతి డ్వాక్రా సంఘానికి రాయితీపై డ్రోన్లు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. సాధారణంగా గ్రామాల్లో మహిళలు పురుషులతో సమానంగా సేద్యంలో కష్టపడుతూనే ఉంటారు. వారు ప్రస్తుతం ఉన్న రంగంలోనే ఆర్థిక సాధికారత చేకూర్చడమే లక్ష్యంగా రాయితీపై డ్రోన్లు అందించనున్నారు. డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల్లో అధిక శాతం వ్యవసాయాధారిత కుటుంబాలే కావడంతో వీరికి నమోదీదీ పథకం ద్వారా లబ్ధి చేకూర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంకల్పించాయి.

ఆరు నెలల శిక్షణ

రాయితీపై డ్రోన్లు అందుకోనున్న సంఘాలకు, మహిళలకు వాటి నిర్వహణపై ఆరునెలల పాటు శిక్షణను ప్రభుత్వం ఇవ్వనుంది. ఎరువులు, పురుగు మందులు పిచికారిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏయే మోతాదులో కలిపి డ్రోన్ ద్వారా ఎలా ఉపయోగించాలనే అంశాలపై శిక్షణ ఇవ్వను న్నారు. శిక్షణ అనంతరం వాటి వాడకానికి ప్రత్యేక అనుమతి పత్రం అంది స్తారు. వరి, మిరప, పత్తి, కూరగాయల సాగులో డ్రోన్ల ఉపయోగం ఎలా ఉండనుంది అనే అంశంతో పాటు దిగుబడుల సమయంలో సాంకేతికతను ఏ విధంగా ఉపయోగించ వచ్చనే వాటిని కూడా శిక్షణలో భాగం చేయనున్నారు.

అమరావతిలో.. వెంకన్న వైభోగం

(5వ పేజీ తరువాయి)

విశ్రాంతి భవనాన్ని, ధ్యాన మందిరాన్ని నిర్మించాలని మాస్టర్‌ప్లానులో ప్రతిపాదించారు. వీటితోపాటు విద్యుత్ సబ్‌స్టేషను, సోలార్ లైటింగ్, సోలార్ పవర్‌ప్లాంటు వంటి నిర్మాణాలను కూడా చేపడతారు.

తొలి మాస్టర్‌ప్లాన్ కన్నా మిన్నగానే...

తొలి మాస్టర్‌ప్లాన్ ప్రకారం ఐదెకరాల విస్తీర్ణంలో కనీసం రెండు ప్రాకారాలతో ఆలయ నిర్మాణం చేసి 20 ఎకరాల్లో యాత్రికుల వసతి సౌకర్యాలు, ఇతరత్రా ఆధ్యాత్మిక పర్యాటక సుందర నిర్మాణాలను చేపట్టాలని ప్రతిపాదించారు. ఈ మాస్టర్‌ప్లానుకు ప్రస్తుతం మరిన్ని మెరుగులు దిద్ది దాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా రూ.185 కోట్లతో ఆలయ విస్తరణపనులను చేపడుతున్నారు. ఇందులో తొలిదశగా రూ107.54 కోట్లతో చేపడుతున్న పనులను రెండేళ్లలో పూర్తిచేయాలని టీటీడీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ క్రమంలో ఆయా పనులను మూడు ప్యాకేజీలుగా విభజించి మూడు వేర్వేరు టెండర్లను టీటీడీ ఆహ్వానించింది.

పర్యవేక్షణా లోపం..

చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా నిర్మాణ పనులకు టీటీడీ సిద్ధంగానే ఉంది. కానీ కొంత పర్యవేక్షణా లోపం కనిపిస్తుంది. 15 మాసాలుగా ఆలయ రూపురేఖలు ఏమాత్రం మారలేదు. మాస్టర్‌ప్లాన్ తయారీ, టెండర్ల విడుదలకే చాలా సమయం గడిచిపోయింది. రెండేళ్లలో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా పర్యవేక్షణా లోపం కారణంగా జాప్యం జరుగుతుందేమోనని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రేపు జాబ్ మేళా

● ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అద్దంకి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్, కళాశాల ప్రిన్సిపాల్ లాజారస్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో రిలయన్స్ జియో(వర్క్ ఫ్రమ్ హోమ్) టాటా క్యాపిటల్, హెటిరోలాబ్స్, మాస్టర్ మైండ్స్ స్కిల్ క్రాఫ్ట్, వరుణ్ మోటార్స్, ముత్తూట్ ఫినన్స్ కంపెనీలు హాజరవుతాయన్నారు. 500కు పైగా ఖాళీలు ఉన్నాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ డిగ్రీ, డిప్లొమా, విభాగాల వరకు చదువుకున్న 18 నుండి 30 సంవత్సరాల నిరుద్యోగ యువత వారి బయోడేటా, రెజ్యూమ్ ఒరిజినల్ పత్రాలు, ఆధార్ నకలు, పాస్‌పోర్టు ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. జాబ్ మేళాకు వచ్చేవారు ఆధార్‌కు లింకైన ఫోన్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పూర్తి వివరాలకు గోపినాథ్, 9440635677, రమేష్ 9949914337 ను, లేదా టోల్ ఫ్రీ నెంబర్ 9988853335 నంబరును సంప్రదించవచ్చన్నారు.

శింగరకొండలో వైభవంగా గిరి ప్రదక్షిణ

ప్రతిపౌర్ణమికి నిర్వహించేలా ఏర్పాట్లు



గిరి ప్రదక్షిణ చేస్తున్న లక్ష్మీనరశింహస్వామి దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, భక్తులు

అద్దంకి, సెప్టెంబరు7 (ఆంధ్రజ్యోతి): శింగరకొండలో ఆదివారం లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. శింగరకొండలోని మెట్ల మార్గం వద్ద ఈవో మద్దినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గిరి ప్రదక్షణ ప్రారంభించారు. గిరి ప్రదక్షిణ శింగరకొండలోని మెట్ల మార్గం వద్ద ప్రారంభమై 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం, గోపాలపురం, భవనాసి చెరువు మీదుగా సుమారు 3 కి.మీ దూరం సాగింది. అనంతరం మెట్ల మార్గంలో 300 మెట్లు ఎక్కి లక్ష్మీనరశింహస్వామి దేవాలయానికి చేరుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో శ్రీనివాసరావు, ఆలయసిబ్బంది, రమాసుందరి ఆధ్వర్యంలో పలువురు మహిళాభక్తులు పెద్ద సంఖ్యలో గిరి ప్రదక్షణ లో పాల్గొన్నారు. ప్రతి పౌర్ణమికి గిరి ప్రదక్షణ నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాస రావు తెలిపారు.



ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం లక్ష తమలపాకుల పూజ వైభవంగా నిర్వహించారు. ప్రాతఃకాల సుప్రభాతం, గోపూజ, బిందెతీర్థం అనంతరం స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు, ఉభయదాతలు వేదస్వస్తి, మంగళ వాయిద్యాలతో ఆలయ ప్రదక్షణ చేశారు. ఐదు ఆవృత్తాలుగా వేదపండితులు, అర్చకులు లక్ష తమలపాకులతో స్వామి వారికి పూజ నిర్వహించారు. స్వామి వారికి మహానివేదన, పంచహారతులు నిర్వహించారు. ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన న్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, యశోద దంపతులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరుడికి ఎమ్మెల్యే కొండయ్య విశేష పూజలు

చీరాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భక్తి శ్రద్ధలతో ప్రశాంతమైన వాతావరణంలో నవ రాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే కొండయ్య పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కొత్తపేటలోని శ్రీనివాసపురం శ్రీగణపతి నవ రాత్రోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయకుని వద్ద ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే కొండయ్య దంపతులు హాజరయ్యారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొన్నారు. అలాగే పందిళ్లపల్లిలో జనసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. శనివారం రాత్రి పట్టణ పరిధిలోని కొట్ల బజార్‌లో 16వ వార్షికోత్సవ వినాయక ఉత్సవాల్లో హాజరయ్యారు. ఎమ్మెల్యే వెంట పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విఘ్నేశ్వరుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య



టీనగర్‌లో ఉత్సవాల్లో చిన్నారులు

పర్చూరు : వినాయక చవితి పర్వదినం సందర్భంగా భక్తులు ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాల నిమజ్జన వేడుకలు ఆదివారంతో ముగిశాయి. వేడుకల ముగింపు సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న గణనాథులను ప్రత్యేక వాహనంలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం నిమజ్జనానికి చీరాల వాడరేవు తరలించారు. కార్యక్రమంలో భాగంగా పర్చూరులోని టీ నగర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, బాణసంచాతో పర్చూరు బొమ్మల కూడలిలో సందడి చేశారు. మహిళలు, యువకులు, చిన్నారులు, వృద్ధుల సైతం పాల్గొని స్వామివారి నిమజ్జన వేడుకలను తిలకించారు.

ఎరువుల కొరతపై రైతులు ఆందోళన చెందవద్దు

ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు

గవినివారిపాలెం(చీరాల), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : డివిజన్ పరిధిలో ఎరువుల కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు సూచించారు. ఆదివారం మండల పరిధిలోని గవినివారిపాలెంలోని రైతుసేవా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా యురియా నిల్వలు పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులకు అందుబాటులో ఎరువులు ఉండేలా చూడాలని డీలర్లకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపీకృష్ణ పాల్గొన్నారు. అంతకుముందు డిఎస్పీ ఎండీ మొయిన్ ఒక సమావేశంలో ఎరువులపై మాట్లాడారు. రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ శాఖ సమిష్టిగా కమిటీలు ఏర్పడి ఎరువుల సరఫరా పటిష్ట చర్యలు చేపట్టినట్లు వివరిం చారు.



ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న ఆర్‌డీవో చంద్రశేఖర్‌నాయుడు

పంగులూరు : మండలంలో ప్రస్తుత పంట సాగుకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెంద వద్దని తహసీల్దార్ సింగారావు, ఎ.ఓ.సుబ్బారెడ్డి లు తెలిపారు. మండలంలో సాధారణ వరి సాగు 122 హెక్టార్లుగా ఉందని, ఇప్పటివరకు 40 హెక్టార్లలో వరిపంట సాగుచేశారన్నారు. మండలంలో 94,455 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. పంగులూరు(1),చందలూరు రైతుసేవా కేంద్రాలతోపాటు అలవలపాడు పృధ్వీ ఎఫ్ఈవో శ్రీవెంకటరమణట్రేడర్స్, సాయిశ్రీనివాసట్రేడర్స్ పంగులూరు మనగ్రోమోర్ సెంటర్‌లో యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైతులు అవసరాన్ని మించి యూరియాను తీసుకోవద్దన్నారు.

ప్రజలకు స్వచ్ఛజలం అందించడం అభినందనీయం

చినగంజాం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడం అభినందనీయమని, టీడీపీ ఎస్సై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవతోటి సుందరరావు అన్నారు. మండలంలోని సంతరావూరు గ్రామంలో అంబేద్కర్‌నగర్ ఎంప్లాయిస్, సంఘ పెద్దలు, నాందివాటర్, గ్రామ పంచాయతీ సహకారంతో నిర్మించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జలధార వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి గ్రామపెద్దలతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. రూ.25 లక్షలతో నిర్మించిన సామాజిక సురక్షిత మంచి నీటి కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకర రావు అన్నారు. కార్యక్రమం లో ఎస్.వీ. యూనివర్శిటీ ప్రొఫెసర్ పి.వెంకటరావు, గ్రామ కార్యదర్శి కృపారావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దేవతోటి నాగరాజు, పర్చూరు నియో జకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి డి.నాగరాజు, ఏ.దేవరపల్లి రాజేష్, ఎన్.దేవ రాజు, ఎన్.అశోక్‌కుమార్, అంబేద్కర్ యూత్ సభ్యులు నూనె మనీష, మెంటా డేనియల్, దేవతోటి ధానం, కవల కోటి తదితరులు పాల్గొన్నారు.



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సుందరరావు

సీఎస్ఆర్ నిధులతో సామాజిక భవనాలు

కొనసాగుతున్న నిర్మాణ పనులు

పంగులూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.1.50 కోట్ల సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న సామాజిక భవనాల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మండలంలోని ఆరు గ్రామాలలో భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. మండలంలోని తూర్పుకొప్పెరపాడు బీసీ కాలనీలో రూ.20లక్షలతో చేపట్టిన భవన నిర్మాణం పూర్తయ్యింది. కొండమూరు ఎస్సీకాలనీలో రూ.40లక్షలు, తూర్పుతక్కెళ్ళపాడు ఎస్సీ కాలనీలో రూ.20లక్షలు, కొండమంజులూరు గ్రామంలో రూ.20లక్షలు, బూదవాడ బీసీ కాలనీలో రూ.30 లక్షలు, పంగులూరు యాదవకాలనీలో రూ.20లక్షలతో నిర్మిస్తున్న భవనాలు వివిధ దశల్లో ఉన్నాయని పీఆర్ఏఈ హనుమంత రావు తెలిపారు.



కొండమూరు ఎస్సీకాలనీలో నిర్మాణంలో ఉన్న భవనం

టీసీఎస్ ట్రైనీ మేనేజర్‌గా సెయింట్‌ఆన్స్ విద్యార్థి

● నియామక పత్రాన్ని అందించిన కళాశాల నిర్వాహకులు

చీరాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థి బాలచందర్ టీసీఎస్ కంపెనీలో ట్రైనీ మేనేజర్‌గా నియమితులయ్యారు. ఆదివారం కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంబంధిత పత్రాన్ని అందించారు. ఇటీవల కంపెనీ ప్రతినిధులు నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో బాలచందర్ ఎంపికైనట్లు తెలిపారు. ఏడాదికి రూ.5.80 లక్షల వేతనం అందుకుంటాడని వివరిం చారు. ప్రిన్సిపల్ డా.జగదీష్‌తో కలిసి ప్రత్యేకంగా అభినందించారు.



నియామకపత్రం అందుకుంటున్న విద్యార్థి

ఉపాధ్యాయుడు రామకృష్ణకు ఘనంగా వీడ్కోలు సభ

సంతమాగులూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బడిబయట ఉన్న విద్యార్థులందరిని బడిలో చేర్పడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఉపాధ్యాయులు రామకృష్ణ తెలిపారు. ఆదివారం సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల (వడ్డెర కాలనీ) నుంచి బదిలీ అయిన నేపథ్యంలో రామకృష్ణకు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రహణం సందర్భంగా ఆలయాల మూత

పర్చూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : చంద్రగ్రహణం నేపథ్యంలో పర్చూరు, కారంచేడు మండలాల పరిధిలో ఆదివారం పలు ఆలయాలను మూసివేశారు. పర్చూరు మండలంలోని చెరుకూరు శ్రీ త్రివిక్రమ, అగస్త్యేశ్వరస్వామి వార్ల దేవాలయాలు, ఉప్పుటూరు వేంకటేశ్వరస్వామి, అమరేశ్వరస్వామి ఆలయం, పర్చూరులోని వేణుగోపాల స్వామి, భీమేశ్వరస్వామి ఆలయాలను మూసివేసినట్లు దేవాదాయశాఖ అధికారి దామా నాగేశ్వరావు తెలిపారు. కారంచేడులోని మాదవస్వామి, మల్లేశ్వరస్వామివార్ల ఆలయాలను మూనివేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఆలయాలను, సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు.

ఆంజనేయస్వామి గుడి మూసివేత

ఇంకొల్లు : పావులూరు పొలిమేర వీరాంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం మూసివేశారు. సాయంత్రం 4 గంటల నుంచి సోమవారం ఉదయం 7 గంటల వరకు మూసివేయనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు అశహరి విష్ణురామచైతన్య తెలిపారు.

దేవాలయాలు మూత

మార్టూరు : మండలంలోని అన్ని దేవాలయాలను మూసివేశారు. మార్టూరులో పడమర బజారున పాండురంగస్వామి దేవస్థానం, ఘట్టేశ్వరస్వామి దేవస్థానం, తూర్పుబజారున రామాలయం. చెన్న కేశవస్వామి దేవాలయం, బొల్లాపల్లి కొండపై లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, తదితర అన్నిదేవాలయాలను మూసివేశారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా హనుమంతరావు



హనుమంతురావు

బల్లికురవ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండల టీడీపీ అధ్యక్షుడిగా నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన దూళ్లిపాళ్ల హనుమంతురావు ఎన్నికయ్యారు. ఆ మేరకు ఆదివారం చిలకలూరిపేటలోని మంత్రి నివాసం వద్ద టీడీపీ నేతలతో సమావేశంలో ఆయనకు నాయకులు మద్దతు తెలిపారు. ముందుగా మండల కమిటీని ఎన్నుకొనేందుకు పార్టీ నేతల నుంచి అభిప్రాయాలను మంత్రి కార్యాలయం సేకరించింది. ఇప్పటి వరకు సూరేపల్లి గ్రామానికి చెందిన ఎస్సీ నేత కొండేటి ఇజ్రాయల్ ఆ పార్టీ మండల అధ్యక్షుడిగా ఉన్నారు. పార్టీ ఆదేశాల మేరకు నూతన కమిటీ ఎంపిక చేయాల్సి రావడంతో అన్ని గ్రామాల నేతలతో మంత్రి కార్యాలయ వర్గ ప్రతినిధులు మాట్లాడారు అధ్యక్షుడిగా ఉండేందుకు ఎవరైన ఆసక్తిగా ఉన్నారా..? కోరగా నక్కబొక్కలపాడు గ్రామానికి చెందిన యువనేత దూళిపాళ్ల హనుమంతురావు ముందుకు వచ్చాడు. దీంతో ఆయనకు పలు గ్రామాలకు చెందిన నేతలు కూడా అంగీకారం తెలిపారు. ఆయన నియామకం పూర్తికాగా, త్వరలో మండల కార్యవర్గం నియమితం కావాల్సి ఉంది.

కేన్సర్ బాధితుడికి ఎల్‌వోసీ మంజూరు

పంగులూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పంగులూరు గ్రామానికి చెందిన పారుమంచి ఖాశీంకు ముందస్తు వైద్య చికిత్సకోసం 2లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. పారుమంచి ఖాశీం గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. విషయాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ చికిత్స నిమిత్తం రూ.2లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఆదివారం బాధితుడు ఖాశీంకు రావూరి రమేష్ అందచేశారు.



బాధితుడికి ఎల్‌వోసీని అందజేస్తున్న రావూరి రమేష్

ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న పర్చూరు ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు

ఇంకొల్లు, సెప్టెంబరు 7,(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతంలో పేదలకు ఉచిత వైద్యసేవలందించడం అభినందనీయమని పర్చూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు అన్నారు. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో గుంటూరు వికాస్ వైద్యశాల వారు ఇంకొల్లు పంచాయితీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని గుంజి వెంకట్రావు,మండపార్టీ అధ్యక్షులు నాయుడు హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పేదలకు తమ వంతు బాధ్యతగా ప్రవేటు హాస్పిటల్స్ వారు ఉచిత వైద్యసేవలందించడం అభినందనీయమన్నారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు డా.నాగరాజు, డా.సురేంద్ర, డా.శివరంజిత్ డా.శివరామకృష్ణ, డా.పవన్ పాల్గొన్నారు. ఆర్థోపెడిక్, కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగాలలో సేవలందించారు. రోగులకు ఉచితంగా బీపీ, జీఆర్‌బీఎస్, ఎకో పరీక్షలు నిర్వహించి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో ఇంకొల్లు పీఏసీఎస్ చైర్మన్ కరి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగపు కార్యదర్శి పాలేరు రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మార్క్, బోడెంపూడి సుబ్బారావు, బోడావుల శివయ్య, చిలుకూరి శ్రీను, పంచాయితీ కార్యదర్శి అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, స్థానిక పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విషజ్వరాల పట్ల జాగ్రతలు తీసుకోవాలి



అవగాహన కలిగిస్తున్న వైద్యులు శరత్‌చంద్ర

ఇంకొల్లు,సెప్టెంబరు 7,(ఆంధ్రజ్యోతి) : విషజ్వరాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ శరత్‌చంద్ర అన్నారు. ఇంకొల్లు రోటరీగంగ భవనంలో రోటరీక్లబ్ ఆఫ్ ఇంకొల్లు, చంద్రహాస్పిటల్స్ వారి ఆధ్వర్యంలో ఇంకొల్లు మండల ప్రాథమిక వైద్యుల సంఘం సహకారంతో విషజ్వరాల నివారణ, నరాల సంబంధిత సమస్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంకొల్లు మండల ప్రాథమిక వైద్యుల సంఘం అధ్యక్షులు షేక్ ఇంతియాజ్, షేక్ ఉమ్రాన్, నాగండ్ల శ్రీనివాసరావు, షేక్ రఫీ, రోటరీక్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బలగం కోటేశ్వరరావు, అలవల రాఘవరెడ్డి, ట్రెజరర్ గోరంట్ల నాగేశ్వరరావు రోటరీక్లబ్ సభ్యులు, మండలంలోని ఆర్ఎంపీలు, పీఎంపీలు పాల్గొన్నారు.

పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌ను కలిసిన నాయకులు



సీతారామయ్యను మర్యాదపూర్వకంగా కలిసిన ఇంకొల్లు నాయకులు


ఇంకొల్లు,సెప్టెంబరు 7,(ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను ఆదివారం ఇంకొల్లు మండల నాయకులు మరాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీతారామయ్య మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో డీఏపీ, యురియా ఎరువుల కొరత లేకుండా అందుబాటులో ఉంచామన్నారు. సీతారామయ్యను కలిసిన వారిలో పర్చూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుంజి వెంకట్రావు, రాష్ట్ర వాణిజ్య విభాగం వైస్ ప్రెసిడెంట్ పాలేరు రామకృష్ణ, ఇంకొల్లు సొసైటీ చైర్మన్ కరి శ్రీనివాసరావు, కొణికి, పావులూరు సొసైటీ చైర్మన్లు బోడెంపూడి సుబ్బారావు, నారిశెట్టి రాంబాబు తదితరులు ఉన్నారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా ఆంజనేయులు



ఏకగ్రీవంగా ఎన్నికైన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ పాలక మండలి

కారంచేడు (పర్చూరు), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు గ్రామంలో వేంచేసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ పాలక మండలి కమిటీ ఎన్నికల ఆదివారం ఏకగ్రీవం అయ్యింది. దీంతో గతంలో నియమితులైన ఆమరా ఆంజనేయులు అధ్యక్షునిగా ఏకగ్రీవం అయ్యారు. ఈయనతో పాటు ఉపాధ్యక్షునిగా యేల్చూరి శ్రీనివాసరావు, కార్యదర్శిగా మువ్వల కాశీ విశ్వనాథం, సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కొత్త పాలక మండలికి శుభాకంక్షలు తెలిపింది.



సోమశిలకు 23,182 క్యూసెక్కుల వరద

అనంతసాగరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సోమశిలకు ఎగువ ప్రాంతాల నుంచి ఆదివారం 23,182 క్యూసెక్కుల వరద వస్తుండగా, 68.270 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,350, డెల్టాకు 1,850 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.







గ్రహణం ఇలా.. రాత్రి 10.35 గంటలకు.. 10.45 గంటలకు.. 10.55 గంటలకు.. 11 గంటలకు.. 11.10 గంటలకు..

సంపూర్ణ చంద్రగ్రహణం

- జిల్లాలోని అన్నీ ఆలయాల మూత
- నేడు పునఃదర్శనం



తల్పగిరి రంగనాథస్వామి ఆలయ తలుపుల మూత

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : భాద్రపదమాస పౌర్ణమి సందర్భంగా రాహుగ్రస్త చంద్రగ్రహణం ఆదివారం రాత్రి 9.57 గంటలకు ప్రారంభమై సోమవారం తెల్లవారుజామున 1.23 వరకు కొనసాగింది. చంద్రగ్రహణ దృశ్యాలు జిల్లావాసులను కనువిందు చేశాయి. ఈ సందర్భంగా జిల్లాలోని అన్నీ ఆలయాలను మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మూసివేశారు. పెంచలకోన, నరసింహకొండ, కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి, కావలి కలుగోళశాంభవి, గొలగమూడి వెంకయ్యస్వామి, జొన్నవాడ కామాక్షితాయి, నర్రవాడ వెంగమాంబ, తల్పగిరి రంగనాథస్వామి, మూలస్థానేశ్వరస్వామి, ధర్మరాజులస్వామి, ఇరుకళల పరమేశ్వరి, అయ్యప్పగుడి, శ్రీరాజరాజేశ్వరి ఆలయాల తలుపులను అర్చకులు, దేవదాయశాఖ అధికారులతో కలిసి మూసివేశారు. గ్రహణం వీడాక ఆయా ఆలయాల్లో శుద్ధి కార్యక్రమాలు నిర్వహించి, భక్తులకు పునఃదర్శన ఏర్పాట్లు చేశారు.



నెల్లూరు నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో మూసి ఉన్న తలుపులు



బిట్రగుంట : ప్రసన్న వేంకటేశ్వరుడి..



నగరంలోని మూలస్థానేశ్వర స్వామి ఆలయం..



రాపూరు : పెంచలోరి ఆలయం..

సెకండ్ సమ్మర్...!

- వర్షాకాలంలోనూ ఎండల వేడి
- ఉష్ణోగ్రతలు 36 నుంచి 39 డిగ్రీల వరకు నమోదు

ఉదయగిరి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో ఏర్పడిన మార్పుల కారణంగా వర్షాకాలమైన సెప్టెంబరు ప్రారంభంలోనూ వేసవిని తలపిస్తోంది. వారం రోజులుగా జిల్లాలోని పలుచోట్ల గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. ఈనెలలో సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. రెండో వారంలోకి ప్రవేశిస్తున్నా ఎండాకాలంలో మాదిరిగా ఉదయం 9 గంటల నుంచే సూరీడు సుర్రుమనిపిస్తున్నాడు. సాయంత్రం గంటల వరకు కూడా ఎండ తగ్గడంలేదు. ఇక మెట్ట ప్రాంతాల్లో చెప్పాల్సినవసరం లేదు. వర్షాకాలంలోనూ వరుణుడు ముఖం చాటేయడం, ఉష్ణోగ్రతలు పెరగడంతో రాత్రి వేళల్లో ప్రజలు ఉక్కపోతకు గురవుతున్నారు. ఈ పరిస్థితులను చూసి జిల్లాలో సెకండ్ సమ్మర్ ప్రారంభమయిందని పలువురు అంటున్నారు.

అలకబూనిన వరుణుడు

ఖరీఫ్ సీజన్‌లో రైతులు వివిధ మెట్ట పంటలు సాగు చేశారు. ఆయా పంటలు కోత దశలో ఉన్నాయి.ఈ సమయంలో చినుకు జాడ లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మరి కొన్ని రోజుల్లో రబీ సీజన్ ప్రారంభం కానుంది. రబీలో ప్రధానంగా వరి, శనగ, పొగాకు తదితర పంటలు అత్యధిక విస్తీర్ణంలో సాగు చేస్తారు. ఆయా పంటల సాగుకు రైతులు ఇప్పుడిప్పుడే సిద్ధమవుతున్నారు. ఈ తరుణంలో వరుణుడు అలకపూనడం, సూరీడు కాక పుట్టిస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎరువులు భూమిలో కరగాలన్నా, తేమశాతం లేకపోవడంతో కొనుగోలు చేసిన వాటిని రైతులు తమ నివాసాల్లో నిల్వ చేశారు.



భానుడి దెబ్బకు నిర్మానుష్యంగా ఉన్న ఉదయగిరిలోని గండిపాళెం రోడ్డు

పేర్లు మార్చుదాం... బిల్లులు కొట్టేద్దాం.. !

- హౌసింగ్‌లో అక్రమార్కుల ఎత్తుగడ
- భారీగా అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్లు
- విజిలెన్స్ విచారణలో వెలుగులోకి..
- ఆ పేర్లతో బిల్లులకు బ్రేక్.. తెరపైకి కొత్త పేర్లు
- బినామీ పేర్లతో బిల్లులు తీసుకునే కుట్ర..!
- చక్రం తిప్పుతున్న హౌసింగ్ ఉన్నతాధికారి బంధువు

నెల్లూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గృహ నిర్మాణ శాఖలో తవ్వేకొద్దీ అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. ఇప్పటివరకూ బయటకు వచ్చిన కుంభకోణాలే కాదని, ఇంకా బయటకు రావాల్సినవి చాలా ఉన్నాయన్న చర్చ జరుగుతున్నది.ఈ తరుణంలోనే అక్రమార్కులు మళ్లీ బరితెగిస్తున్నారు. ఇప్పటి వరకూ ఒక పేరుపై పనులు చేశాం.. కాబట్టి ఇప్పుడు ఆ పేరును తీసేసి మరో పేరు పెట్టుకుంటే చేసిన పాపమంతా పోతుందన్న కుట్ర ఆలోచనకు తెరలేపారు. తెరలేపడమే కాదు.. ఆచరణలో కూడా పెట్టారు. జిల్లాలో ఇప్పటికే వందల ఇళ్లు ఒక కాంట్రాక్టర్ పేరు నుంచి మరో కాంట్రాక్టర్ పేరుపైకి మారిపోయినట్లు తెలుస్తోంది. చిన్న కాంట్రాక్టర్ల నుంచి పెద్ద కాంట్రాక్టర్ల వరకూ ఇదే పంథాను అనుసరించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇలా కొత్త పేర్లను పెట్టి ఆ పేరు మీద బిల్లులు నొక్కేయాలన్న కుట్రలు పన్నుతున్నట్లు గృహ నిర్మాణశాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ అవినీతి వ్యవహారాలకు బ్రేకులు వేయాల్సిన హౌసింగ్ అధికారులే అక్రమార్కులకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తెరపైకి కొత్త పేర్లు

వైసీపీ ప్రభుత్వంలో పేదల ఇళ్ల మాటున భారీ దోపిడీ మొదలుపెట్టారు. ఆప్షన్-3 పేరుతో లబ్ధిదారుల అనుమతి లేకుండానే వారి ఇళ్లను కాంట్రాక్టర్లకు అప్పగించారు. కనీసం అగ్రిమెంటు కూడా లేకుండా రూ.కోట్ల విలువైన పనులు కట్టబెట్టారు. ఈ మాటున కాంట్రాక్టర్లు కొన్ని చోట్ల పనులు చేయకుండా, మరికొన్ని చోట్ల తూతూమంత్రంగా పనులు చేసి పేదల సొమ్మును జేబుల్లో వేసుకున్నారు. ఈ హౌసింగ్ దోపిడీపై కూటమి ప్రభుత్వం వచ్చాక విజిలెన్స్ విచారణ జరిపింది. ఒక్క నెల్లూరు జిల్లాలోనే సుమారు రూ.110 కోట్ల ప్రభుత్వ సొమ్ము పక్కదారి పట్టినట్లు తేలింది. ఈ సొమ్ము మొత్తాన్ని కాంట్రాక్టర్ల వద్ద నుంచి రికవరీ చేయాలని విజిలెన్స్ సూచించింది. ఇందుకు బాధ్యులుగా జిల్లాలో 365 మంది అధికారులను చేర్చడం గమనార్హం. అందులో గృహ నిర్మాణ శాఖకు చెందిన పీడీ నుంచి ఏఈ స్థాయి వరకూ ఉన్న అధికారులు 71 మంది ఉండగా, గ్రామ సచివాలయ సిబ్బంది 211 మంది, వార్డు సచివాలయ సిబ్బంది 83 మంది ఉన్నారు. విజిలెన్స్ రిపోర్టు ఇచ్చాక చాలామంది కాంట్రాక్టర్ల నుంచి రికవరీ చేయాల్సి ఉండడంతో అటువంటి వారికి కొత్తగా బిల్లులు చెల్లించడం ఆపేశారు. దీంతో ఇటువంటి వారందరికీ కొందరు -హౌసింగ్ అధికారులు విలువైన సలహా ఇచ్చినట్లు సమాచారం. ఈ కాంట్రాక్టర్లు తీసుకున్న ఇళ్లంటినీ మరొక కొత్త కాంట్రాక్టర్ పేరుపైకి మార్చి, ఆ పేరుపై పాత, కొత్త బిల్లులు తీసుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాగో అగ్రిమెంట్ కూడా లేదు కాబట్టి ఇలా ఇళ్లను మరొకరి పేరుపైకి మార్చేడం ద్వారా తప్పు చేసిన కాంట్రాక్టర్లపై అధికారికంగా భవిష్యత్‌లో చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉండదని అక్రమార్కులు భావిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కావలి, ఆత్మకూరు ప్రాం తాల్లో 500 ఇళ్ల వరకూ ఇతరుల పేర్లపైకి మారినట్లు తెలుస్తోంది. మరికొందరి ఇళ్లను కూడా మార్చేందుకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నట్లు సమాచారం. హౌసింగ్‌లో పనిచేస్తున్న ఓ ఉన్నతాధికారి సమీప బంధువు కావలిలో ఉండగా, ఆయన గత ప్రభుత్వంలో పేదల ఇళ్ల నిర్మాణాలు చేసి ఆరోపణలు మూటగట్టుకున్నారు. ఇప్పుడు ఆ వ్యక్తే అక్రమార్కులను తప్పించేందుకు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.



ఎలాగైనా బిల్లులిప్పిద్దాం..!

పేదల సొమ్మును దోచుకున్నట్లు విజిలెన్స్ విభాగం తేల్చిన తర్వాత కూడా అక్రమార్కులకు ఎలాగైనా బిల్లులు ఇప్పించాలని కొందరు హౌసింగ్ అధికారులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్ నివేదిక ఆధారంగా కాంట్రాక్టర్ల నుంచి రికవరీ చేయాల్సింది పోయి ఇటీవల కొందరు కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు ఇప్పించేందుకు జిల్లా నుంచి రాష్ట్ర కార్యాలయానికి ప్రతిపాదనలు వెళ్లాయి. అయితే ఈ ప్రతిపాదనలు జిల్లా స్థాయిలో స్క్రూటినీ జరగలేదు. దీంతో వాటిని రాష్ట్ర కార్యాయల అధికారులు తిప్పి పంపారు. ఈ బిల్లులపై సంతకాలు పెట్టేందుకు కొందరు అధికారులు భయపడుతున్నారు. అయినా ఎలాగైనా బిల్లులు పంపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది.

రోడ్డున పడ్డ శనగ రైతు

- గిట్టుబాటు ధరలేక నానా అగచాట్లు
- గత ఏడాదిగా శీతల గిడ్డంగుల్లోనే పంట దిగుబడులు
- విత్తనం కొనుగోలు కంటే సగానికి దిగజారిన క్వింటాం ధర
- మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వం ఆదుకోవాలి



కావలి రైతుబజారు ఎదుట శనగల బస్తా పెట్టుకుని అమ్ముకుంటున్న రైతు


కావలి రూరల్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): వర్షాధారం ఆధారంగా పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక రోడ్డున పడ్డామని శనగ రైతులు వాపోతున్నారు. గత ఏడాది జిల్లాలో 8,666 ఎకరాల్లోనూ, కావలి మండలం చౌదరిపాలెం, జలదంకి మండలం గన్నారపుగుంట, బ్రాహ్మణక్రాక గ్రామాల్లో సుమారు 500 ఎకరాలల్లో శనగ పంట ను రైతులు సాగుచేశారు. ప్రకాశం జిల్లా నుంచి వలసవచ్చి ఇక్కడ స్థిరపడ్డ రైతులు నల్లరేగడి భూముల్లో వర్షాధారంతో పొగాకు, శనగ సాగుచేస్తున్నారు. ఎకరాకు కౌలు, దుక్కులు, ఎరువులు, పురుగు మందులు, విత్తనాలతో కలిపి రూ.40,000పైగా ఖర్చు పెట్టి రైతులు శనగ పండించారు. గత ఏడాది పంట వేసే సమయంలో శనగల ధర క్వింటాం రూ.12,000 ఉండగా, ప్రభుత్వం రైతులకు రాయితీపై క్వింటాం రూ.9,200లకు అందించింది.

తగ్గిన దిగుబడి

అధికవర్షాలతో వాతావరణం అనుకూలించకపోవటంతోపాటు పంట సాగులో వెనుకచిక్కడంతో గత ఏడాది ఎకరాకు 4 నుంచి 5 క్వింటాల దిగుబడి మాత్రమే వచ్చింది. దిగుబడి తగ్గడంతోపాటు క్వింటాం ధర రూ.5,000 నుంచి 6,000 పలికింది. ఎకరాకు రూ.40,000 పెట్టుబడి పెడితే రూ. 25,000 నుంచి రూ. 30,000 వరకు మాత్రమే వచ్చాయి. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట వేసేటప్పుడు ఉన్న విత్తనధర కంటే పంట చేతికి వచ్చాక ఉన్న ధర సగం కూడా లేకపోవటంతో కొందరు రైతులు శనగలను ప్రకాశం జిల్లాలోని శీతల గిడ్డంగులకు తీసుకెళ్లారు. అక్కడ ఏడాదికి క్వింటాకు రూ. 150 చొప్పున చెల్లిస్తూ నిల్వ చేశారు. అయినా నేటివరకు మద్దతు ధర లేక పోగా, పంట దిగుబడి నిల్వల ఖర్చు మాత్రం పెరిగిపోయింది. దీంతో కొందరు రైతులు రైతుబజారు ఎదుట రోడ్లపై శనగ బస్తాలు పెట్టుకుని, వచ్చిన కాడికి తెగనమ్ముకుంటున్నారు. మరికొందరు మోటారు సైకిళ్లపై బస్తా పెట్టుకుని వెళ్లి గ్రామాల్లో తిరిగి అమ్ముకుంటున్నారు. వారి పరిస్థితి చూస్తుంటే కళ్లు చెమ్మగిల్లుతున్నాయి.. ఇప్పటికైనా మద్దతు ప్రకటించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర లేక రూ. లక్షల్లో నష్టపోయా

భూమి కౌలుకు తీసుకుని 35 ఎకరాల్లో శనగ పంట సాగుచేసి రూ.12 లక్షల మేర నష్టపోయా. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించక పోవటంతో ప్రకాశం జిల్లా ఒంగోలు వద్ద ఉన్న కోల్డ్ స్టోరేజీలో 300 క్వింటాలు నిల్వ చేశా. రెండేళ్ల నుంచి సరుకు అక్కడే మగ్గిపోతున్నది.



\- బత్తుల రవిప్రసాద్, చౌదరిపాలెం కౌలు రైతు

మళ్లీ కన్యాశుల్కం..!

- వధువు వేటలో... వార్ధక్యం చేరువ..!
- బ్రహ్మచారులుగా మిగులుతున్న యువత
- తీవ్రమవుతోన్న పెళ్లికూతుళ్ల సమస్య
- మారుతున్న పరిస్థితుల్లో ఆలస్యంగా వివాహాలు
- ఇప్పటికే కొన్ని కులాల్లో తీవ్రమైన కొరత



నెల్లూరు(విద్య), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వధువు కావలెను... ప్రస్తుతం ఏ పత్రిక తిరగేసినా, ఏ వివాహ వేదిక(సైట్) చూసినా కుప్పలు తెప్పలుగా ఇలాంటి ప్రకటనలే కనిపిస్తున్నాయి. భ్రూణహత్యల నేపథ్యంలో భవిష్యత్ సంగతేమోగానీ, ఇప్పటికే పెళ్లికుమార్తెల సమస్య వేధిస్తోంది. వివిధ కులాల్లో పెళ్లీడుకి వచ్చిన యువతులకు కొరత రాగా, అమ్మాయిల కోసం పక్కరాష్ట్రా లను చుట్టి రావాల్సిన దుస్థితి నెలకొంది. ఈ తరుణంలో పలువురు యువకులు కట్నంలేకుండా పెళ్లిళ్లకు సిద్ధమవు తున్నారు. మరికొందరు కన్యాశుల్కంతో ముందుకొస్తున్నారు. మరికొందరు పిల్ల దొరక్క, పెళ్లికాక బ్రహ్మచారులుగా మిగిలిపో తున్నారు. దీన్ని బట్టి చూసే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తగ్గుతున్న ఆడపిల్లల జనాభా

భ్రూణహత్యలతో ఆడపిల్లల జనాభా నానాటికీ తగ్గుతోంది. ఫలితంగా రానున్న రోజుల్లో యువకులు పెళ్లాడేందుకు యవతులే లేకుండా పోవచ్చు... కొంతకాలంగా పలు స్వచ్ఛంద సంస్థలు, సామాజికవేత్తల పడుతున్న ఆందోళన ఇది. కానీ ఇది పాక్షికసత్యమే కావచ్చు. ఇప్పటికే చాలా కులాల్లో పెళ్లీడు యువతల కొరత తీవ్రమైంది. ఈడొచ్చిన కొడుకులకు పెళ్లిళ్లు చేయలేక తల్లిదండ్రులు కాలికి బలపం కట్టుకుని తిరగాల్సి వస్తున్నది. మ్యారేజీ బ్యూరోలను ఆశ్రయిస్తూ పక్కరాష్ట్రాలకు సైతం పరుగులు పెడుతున్నారు. భారతీయ వివాహ వ్యవస్థ ఎంతో పవిత్రమైంది. పటిష్ఠమైనది కూడా..... నాలుగైదు దశాబ్దాలు వెనక్కి వెళితే పెళ్లి కుదుర్చుకోవాలంటే కులం, గోత్రమే కాదు... ముందు ఏడు తరాలు, వెనక ఏడుతరాల చరిత్ర కూడా చూసేవారు. పెద్దలు చెప్పినదాన్ని బట్టి చూస్తే అప్పట్లో మగవాళ్ల కంటే ఆడపిల్లలే అధికంగా ఉండేవారు. కట్నకానుకలు సమర్పించి కన్యాదానం చేసేవారు. ఇటీవల వరకు ఇలాంటి పరిస్థితే ఉన్నా క్రమంగా మారుతోంది. గత కొన్ని దశాబ్దాలుగా ఆడపిల్లలపై కొనసాగుతున్న వివక్ష, పెంపకంలో పౌష్టికాహార లోపాలు, లింగనిర్ధారణ పరీక్షలతో భ్రూణహత్యలు పెరుగుతున్నాయి. పుట్టిన పాపలను సైతం హతమార్చడం లాంటి ఘటనలు వల్ల చాలా కులాల్లో ఆడపిల్లల సంఖ్య దారుణంగా పడిపోయింది. రెండు దశాబ్దాలుగా ఇది కొనసాగుతుండడంతో ప్రస్తుతం పెళ్లీడుకొచ్చిన ఆడపిల్లలు దొరకడంలేదు.

కారణాలు ఎన్నో...

గతంలో బాల్య వివాహాలు ఉండేవి. ఆ తరువాత వధువుకి 18, వరుడికి 21 ఏళ్ల నిండాకే వివాహం చేయాలన్న చట్టం వచ్చింది. ఇప్పుడు చదువు, ఉద్యోగ వేటలో పడి 25 నుంచి 30 ఏళ్లకుపైగా ఎవరూ పెళ్లి చేసుకోవడం లేదు. ముఖ్యంగా ఉన్నత విద్యావంతులు, వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేస్తూ తమలాంటి కెరీర్ ఉన్నవారినే కోరుకుంటున్నారు. దీంతో వధువుల కొరత తీవ్రమైపోతోంది. ఈ నేపథ్యంలో కులాల పట్టింపులను కూడా పక్కన పెడుతున్నారు.

పెళ్లికుమార్తెల కొరత

ఓ అగ్రకులానికి చెందిన యువకుడి వయసు ప్రస్తుతం 35 ఏళ్లు. దాదాపు ఐదేళ్లుగా వధువు కోసం వెతుకుతున్నారు. కట్నం లేకపోయినా పర్వాలేదనుకున్నా పిల్ల మాత్రం దొరకడం లేదు. రెండు వైపులా పెళ్లిఖర్చులు తామే పెట్టుకుంటామనుకున్నా సంబంధాలు దొరకడం లేదు. ఇలాంటి పరిస్థితి చాలా కులాలకు వచ్చేసింది.



తమకు అనుబంధంగా ఉన్న ఉపకులాల్లో పిల్ల అయినా పర్వాలేదనుకున్నా కూడా అమ్మాయి దొరకడం లేదు. కులం కట్టుబాట్లను గౌరవించే వాళ్లు ఎన్నాళ్లైనా సరే అదే కులం అమ్మాయిల కోసం నిరీక్షిస్తుంటే, కులాల పట్టింపు అంతగా లేని వారెందరో ఇతర కులాల అమ్మాయిలను వెతికి మరీ పెళ్లాడాల్సిన పరిస్థితి వస్తోంది. ప్రధానంగా వధువులకు ఉన్న కొరతతోనే కులాల వారీగా వివాహ వేదికలు వెలుస్తున్నాయి. ఇందులో కొన్ని సేవా దృక్పథంతో పనిచేస్తుంటే, మరికొన్ని కమీషన్ బేస్డ్‌గా పనిచేస్తున్నాయి.

ఇక కన్యాశుల్కమేనా ?

ఈ పరిణామాలు భవిష్యత్‌లో కన్యాశుల్కానికి దారితీసే సూచన లేనని పలువురు పెద్దలు చెబుతుండడం గమనార్హం. పాత రోజుల్లో కన్యాశుల్కం చెల్లించి పెళ్లిళ్లు చేసుకునేవారు. ఆ తర్వాత కట్నం ఇచ్చే రోజులు వచ్చాయి. తాజా పరిస్థితుల నేపథ్యంలో తిరిగి కన్యాశుల్కం ఇచ్చే రోజులు త్వరలోనే వచ్చేస్తున్నట్లు అంచనా వేస్తున్నారు.

రాంబాబుకు ఘన సన్మానం

కందుకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన పోకూరి రాంబాబును ఆదివారం పలువురు ఉపాధ్యాయులు ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించారు. కందుకూరి సుబ్బనాచారి, సంగా మహేంద్ర, చల్లా బ్రహ్మయ్య, వేమా వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ తదితరులు రాంబాబును కలిసి కందుకూరు ప్రాంతంలో విద్యారంగ అభివృద్ధికి పని చేయాలని ఆకాంక్షించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

● పాఠశాలకు రూ.లక్ష వితరణ



గురువు తెలికేపల్లి శ్రీనివాసులును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

కావలి(టౌన్), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విశ్వోదయ బాలురు ఉన్నత పాఠశాలలో 1975-76 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ ప్రాస ప్రావీణ్యుడు అన్నదాత మణి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు భీమరాజు మధుసూదనాచార్యులు, సుధాకర్ పాల్గొన్నారు. ముందుగా అప్పటి ఉపాధ్యాయుడు తెలికేపల్లి శ్రీనివాసులును శాలువా, పూలమాలతో పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించి పాదాభివందనం చేశారు. 65 ఏళ్ల వయస్సులో వారంతా పాత జ్ఞాపకాలు గుర్తుకు తెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. పూర్వ విద్యార్థి నారాయణరెడ్డి పాఠశాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ద్వారకానాథ్ చౌదరి, పూర్వ విద్యార్థులు చేవూరు అజయ్‌కుమార్, టీవీఎంఎన్ ప్రకాష్, ఎంవీ రామారావు, విష్ణు, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తుత్తి హామీగా ఉపాధి హామీ పథకం

కావలి(టౌన్), సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకం ఉత్తుత్తి హామీగా మారిందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తాళ్లూరు మాల్యాద్రి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శివరామసుబ్బయ్య భవనంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ స్థాయి 6వ మహాసభలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగడం లేదని, కావలిలో 14 వారాలకు పైగా ఉపాధి హామీ డబ్బులు ఇవ్వలేదని ఆరోపించారు. వేతనం రోజుకు రూ.307 ఇవ్వాల్సి వుండగా వంద నుంచి 150 రూపాయలు చెల్లిస్తున్నారన్నారన్నారు. పని ముట్లు ఆటో చార్జీలు ఇవ్వడంలేదని, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాటలు ఆచరణ శూన్యమన్నారు. కార్యక్రమంలో వేముల శీతారామయ్య, రాధాకృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు ఏరియా ఆసుపత్రికి కొత్త అంబులెన్స్



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టరు శకుంతల

కందుకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఏరియా ఆసుపత్రికి ప్రభుత్వం నూతన 108 వాహనాన్ని మంజూరు చే సింది. అత్యాధునిక లైఫ్ సపోర్టు వైద్యపరికరాలతో కూడిన ఈ వాహనాన్ని ఆసుపత్రికి సూపరింటెండెంట్ డాక్టరు శకుంతల ఆదివారం ప్రారంభించారు. ఈ అంబులెన్స్ సహాయంతో అత్యవసర సేవలకు వీలవుతుందని ఆమె పేర్కొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి

జలదంకి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై ప్రతీ పౌరుడు అవగాహన పెంచుకొని సమాజంలో జరిగే అవినీతిని చట్టం ద్వారా అడ్డుకట్ట వేసేందుకు కృషి చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్రకమిటీ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రూ.20 కోట్ల అడ్డ కాలువ భూముల

పరిరక్షణకు చర్యలు

● ఎట్టకేలకు సర్వే చేపట్టిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ● హద్దు రాళ్ల ఏర్పాటుకు శ్రీకారం

కావలి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పట్టణానికి తూర్పుభాగంలో ఆక్రమణలకు గురైన సుమారు రూ.20 కోట్ల విలువైన అడ్డకాలువ భూముల పరిరక్షణకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రెండు రోజులుగా సర్వే చేపట్టి హద్దు రాళ్లు నాటించే కార్యక్రమం వేగవంతంగా జరుగుతోంది. అత్యంత విలువైన అడ్డకాలువ భూములను రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించడంతో జలవనరులశాఖ అధికారులు విన్నపం మేరకు రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. దీంతో సుమారు 6 ఎకరాల వరకు భూములు ఆక్రమణలకు గురైనట్లు రెవెన్యూ, జలవనరులశాఖ అధికారులు గుర్తించారు. ఈ భూములు విలువ ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.20 కోట్ల వరకు ఉంటుంది. కావలి పట్టణ మద్దూరుపాడు రోడ్డు నుంచి గాయిత్రినగర్, పాతూరు మీదుగా పట్టణ తూర్పు వైపున ఉన్న రియల్‌ఎస్టేట్ ప్లాట్లలో కొత్తగా నిర్మిస్తున్న ఇళ్ల మధ్యలో నుంచి తుమ్మలపెంట రోడ్డులోని తాళ్లపాలెం వరవ కాలువ వరకు ఆ అడ్డ కాలువ విస్తరించి ఉంది. గతంలో పట్టణానికి తూర్పున పూర్తిగా రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దానిని ఒకసారి సర్వే చేయగా మున్సిపల్ అధికారులు కచ్చా కాలువ కొట్టారు. అయితే కాలువను ఆ భూమికి రెండు వైపులా కొంత వదిలేసి మధ్యలో కాలువ తీయటంతో రెండు పక్కలా మిగిలిన భూమిని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకుని తమ ప్లాట్లలో కలుపుకున్నారు. దీంతో ఆ ప్లాట్లను ఎవరికైనా విక్రయిస్తే కొనుగోలు చేసిన వారు నష్టపోనుండటంతో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ, జలవనరులశాఖ అధికారులు కదిలారు. తహసీల్దారు పీ.శ్రావణ్‌కుమార్ చొరవ తీసుకుని దానిని మళ్లీ జలవనరులశాఖ అధికారుల సమక్షంలో సర్వే చేయించారు. దీంతో జలవనరుల శాఖ అధికారులు తమ స్థలాలు ఎంతవరకు ఉన్నాయో అంత వరకు హద్దు రాళ్లు ఏర్పాటు చేస్తుండటంతో విలువైన ప్రభుత్వ భూములకు రక్షణ కలిగినట్లైంది.



అడ్డ కాలువ హద్దులకు సర్వే రాళ్లు నాటుతున్న కూలీలు

కార్మికుల సమస్యలపై స్పందించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్

ఉలవపాడు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : కార్మిక సమస్యలపై పీటీపీ పొగాకు కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి వీడాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే అజయ్‌కుమార్ కోరారు. ఆదివారం జరిగిన కరేడు ర్యాంపు పీటీపీ స్టాఫ్, వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీలో కార్మిక శాఖ జిల్లాస్థాయి అధికారులు ప్రతినెల తనిఖీలు నిర్వహించి, కార్మికులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాల గురించి యాజమాన్యాన్ని ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. 200 మంది ఉండే పరిశ్రమలో వాహన సదుపాయం, ఈఎస్ఐ సౌకర్యం లేదన్నారు. పొగాకు త్రెస్సింగ్ ప్లాంట్‌లో పనిచేసే కార్మికులు ఊపిరితిత్తుల వ్యాధితో ఇబ్బంది పడుతున్నారని, ఇప్పటికే కొందరు మరణించారన్నారు. కార్మికులకు రక్షణ చర్యలతోపాటు ఫెస్టివల్ అడ్వాన్సు, ఏడాదికి రెండు జతల బట్టలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మొదటిసారిగా డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో జరిగే సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలకు పెద్ద సంఖ్యలో కార్మికులు తరలి రావాలని పిలుపునిచ్చారు.

చంద్ర గ్రహణంతో ఆలయాల మూత



మూసివేసిన ముసునూరులోని ఆంజనేయస్వామి క్షేత్రం

కావలి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణంతో పట్టణంలోని అన్ని ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం నుంచి మూతవేశారు. పట్టణంలో ప్రధానమైన కలుగోళ్ల శాంభవి ఆలయం, విష్ణాలయం, పాతూరు శివాలయం, సాయిబాబా మందిరం, సత్యనారాయణస్వామి ఆలయం, ముసునూరులోని ఆంజనేయస్వామి ఆలయాలను మూసివేశారు.

● బిట్రగుంట : బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసి ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మధ్యాహ్నం మూసివేశారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు ఆలయ సంప్రోక్షణ కార్యక్రమ అనంతరం యధావిధిగా శ్రీవారి దర్శనం ఉంటుందని అర్చకులు తెలిపారు. బిట్రగుంట, చెంచులక్ష్మీపురం, నాగులవరం, చెన్నారెడ్డిపాలెం, జువ్వలదిన్నెలో ఆలయాలను మూసివేశారు.

మద్దతు ధరకు ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

అల్లూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన రెండోకారు ధాన్యానికి మద్దతు ధర కల్పించి రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రేడ్-1 ధాన్యానికి రూ.20,306, సాధారణ రకానికి రూ.20,136 వంతున ధరను నిర్ణయించి ప్రభుత్వమే కానుగోలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధర సాధనకు ఈనెల 9న నెల్లూరు గాంధీబొమ్మ సెంటరు నుంచి కలెక్టరేట్ వరకు జరుగబోయే ప్రదర్శనలో రైతులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గోపసాని రమేష్, పాటి భాస్కర్, షేక్ రషీద్, నేతగాని రమణయ్య, కంచుపాటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

● **జలదంకి(ఆంధ్రజ్యోతి):** రెండో పంట ధాన్యం ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు రావి మాల్యాద్రి అధ్యక్షతన మండల రెండవ మహాసభ జరిగింది. ఈ మహాసభలో అధ్యక్షుడిగా రావి మాల్యాద్రి, ప్రధానకార్యదర్శిగా గడ్డం మాల్యాద్రి, 6మంది కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ జిల్లాలో రెండోకారులో పండించిన ధాన్యంను దళారీలు రూ.15, రూ.16వేలకు అడుగుతున్నారని ఈ ధరకు అమ్మితే రైతులు దివాళా తీస్తారని పేర్కొన్నారు. అనంతరం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా జిల్లా రైతుసంఘం ప్రధానకార్యదర్శి మూలి వెంగయ్య, నాయకులు మేలంగి ఆంథోనీబాబు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేటి నుంచి ఎస్టీల కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆధార్‌కార్డులు లేని ఎస్టీల కోసం ఈనెల 8 నుంచి 13వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ నమోదు క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతీ మండలంలోని గ్రామాల్లోని సచివాలయాల్లో నిర్దేశించిన తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రాలు పనిచేస్తాయని పేర్కొన్నారు. కేవలం ఆధార్ లేని ఎస్టీల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయించిన ఈ ఆధార్ క్యాంపులను ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బీవీ రమణకు ఘన సన్మానం

కందుకూరు, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత బీవీ రమణ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. స్థానిక జనార్దనస్వామి దేవస్థానం నూతన కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులతో పాటు ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని బీవీ రమణ, సులోచన దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి వల్లూరి కోటేశ్వరరావు, రంగశెట్టి రమేష్, కొల్లి రమావతి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు వై.హనుమంతరావు, అశోక్‌బాబు, కేపీ జాన్సన్, బండి గోవిందయ్య, తదితరులు పాల్గొన్నారు.

'తైక్వోండో'తో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చు

బిట్రగుంట, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): తైక్వోండో మార్షల్ ఆర్ట్స్ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తోందని స్థానిక ఎస్ఐ ఎస్.ప్రభాకర్, దగదర్తి ఎస్ఐ జంపానికుమార్‌లు పేర్కొన్నారు. బిట్రగుంట రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఇంటర్ నేషనల్ తైక్వోండో మాస్టర్ ఈ.రవిగన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆదివారం బెల్ట్ టెస్ట్ కార్యక్రమం నిర్వహించారు. 23 మంది విద్యార్థులు బెల్ట్ ఎగ్జామినేషన్‌లో పాల్గొనగా అందులో 8 మంది అత్యధిక ప్రతిభను ప్రదర్శించి డబుల్ ప్రమోషన్ పొందారు. వారికి బెల్ట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ మాజీ గౌరవ అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు యాదవ్, స్వర్ణన్‌రాజ్, రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో పౌర్ణమి పూజలు



హోమం చేస్తున్న పూజారులు, పాల్గొన్న భక్తులు

సంగం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమనకొండలో ఉన్న రాజరాజేశ్వరిదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం హోమం, లలిత సహస్రనామం తదితర పూజలు నిర్వహించారు. తరువాత ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి భక్తులకు ప్రాణయామం, ధ్యానం, యోగా ప్రాధాన్యతను వివరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ చేశారు. ఈకార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా కోలగట్లలోని నాగవరపమ్మ ఆలయంలో భక్తులు పొంగళ్లు పొంగించి పౌర్ణమి పూజలు నిర్వహించారు. పూజలనంతరం ఆలయాలను మూసి వేశారు.

మంత్రి ఆనంను కలిసిన మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్



మంత్రి రామనారాయణరెడ్డిని కలిసిన షేక్ సల్మాషిరీన్, టీడీపీ నాయకులు

చేజర్ల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాజీ జడ్పీటీసీ సభ్యురాలు షేక్ సల్మా షిరీన్‌ను ఆంధ్రప్రదేశ్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించిన నేపథ్యంలో రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆదివారం తాడేపల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మండల టిడిపి అధ్యక్షుడు షేక్ సిరాజుద్దీన్, మాజీ ఎంపిపిలు రావి పెంచలరెడ్డి, అన్నలూరు శ్రీనివాసులునాయుడులతో కలసి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమ్మి సిద్దులనాయుడు, జయంతులునాయుడు, చీర్ల వెంకటేశ్వర్లు, మస్తాన్, బాబు, ఆదినారాయణ రెడ్డి పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ఇసుక

● జారిపడితే అంతే సంగతులు



దారి పొడవునా ఉన్న ఇసుక

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రయాణాలను సులభతరం, వేగవంతం చేసేందుకు నిర్మాణాలు చేపట్టిన జాతీయ రహదారులు కొంతమంది నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. మండలంలో జడదేవి నుంచి భోగ్యం వారిపల్లి వరకు 565 జాతీయ రహదారి నిర్మాణం చేపట్టడం జరిగింది. తొలుత ఎంతో సంబరపడిన ప్రజలు క్రమేణా భయాందోళనలతో కాలం వెల్లబుచ్చాల్సిన దుస్థితి నెలకొంది. మారుమూల పల్లె ప్రాంతాలు కావడంతో అధికారుల పర్యవేక్షణ, ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడంతో ఆ మార్గంలో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మితిమీరిన వేగంతో పాటు రాత్రింబవళ్లు రహదారిపై సంచరిస్తున్న పశువులను తప్పించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రస్తుతం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఇసుక వ్యాపారులు స్థానిక గ్రామాలతో సహా జాతీయ రహదారిపై ప్రకాశం జిల్లాకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో కనీస జాగ్రత్తలు పాటించక పోవడంతో వాహనాల్లోని ఇసుక దారి పొడవునా రహదారిని కమ్మేస్తుంది. దీంతో ఆ మార్గంలో పరుగులు తీసే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రధానంగా మార్జిన్లలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ఎక్కడ జారి పడాల్సి వస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వ్యవసాయ సహకార సొసైటీ అభివృద్ధికి కృషిచేయాలి

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను సన్మానిస్తున్న సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్

సీతారామపురం, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహకార సొసైటీ అభివృద్ధికి కమిటీ కృషిచేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సూచించారు. మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ సహకార సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో బీసీలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. సీతారామపురం మండల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. మండలంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, ఇచ్చిన మాట ప్రకారం ప్రతి 50 ఇళ్లకు ఒక వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగు తుందని, సీసీ రోడ్లు లేని ప్రతి గ్రామంలో రోడ్డు వేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. అలాగే సీతారామపురం హైవే కూడలి వద్ద నుంచి నాలుగు పంచాయతీలను కలుపుతూ రూ. 80 కోట్లతో ఆర్అండ్‌బి రింగ్‌రోడ్డు నిర్మాణం జరుగుతుందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికలలో మరోసారి వైసీపీకి గట్టిగా బుద్ధి చెప్పి నియోజకవర్గంలోని 143 పంచాయతీలను గెలుచుకుంటామనే నమ్మకం ఉందని, ఆ దిశగా ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మస్నేటి వెంకటరెడ్డి, మండల కన్వీనర్ కప్పు ప్రభాకర్‌రాజు, సొసైటి అధ్యక్షుడు రాజశేఖర్, ముత్తంశెట్టి చెన్నకేశవులు, వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, సర్పంచ్ కొడవటికంటి భాగ్య కుమారి, షేక్ బాబు, జాషువా, ఇజ్రాయిల్, ఆదినారాయణ, తమిశెట్టి రమణయ్య, మాజీ జడ్పిటిసి కలివెల జ్యోతి, కాశీరత్తయ్య, ఎడమ ప్రవీణ్, దేవర వెంకటేశ్వర్లు, చంద్రారెడ్డి, పాల్గొన్నారు.

యాదవపాళెంలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

ఉదయగిరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యాదవపాళెంకు గత వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో ఈ దుస్థితి నెలకొందని, గుక్కెడు నీటి కోసం కష్టాలు పడుతున్నామని ఆప్రాంత ప్రజలు వాపోయారు. నగదు వెచ్చించి ట్యాంకర్లు కొనుగోలుచేసి నీటి అవసరాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి ఇబ్బందులు తీర్చాలని కోరారు. ఈ విషయమై డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లాను వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతులు చేయించేందుకు తీసుకెళ్లారని, రాగానే ఏర్పాటుచేసి నీటి సమస్య తీరుస్తామన్నారు.

అందని స్మార్ట్ రేషన్ కార్డులు

● ఆందోళనలో లబ్ధిదారులు

అనంతసాగరం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో 25 గ్రామ పంచాయతీలు ఉండగా 37 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఇటీవల ప్రభుత్వం పారదర్శకంగా సరకులు పంపిణీ చేసేలా అందజేసిన స్మార్ట్ రేషన్‌కార్డులు మండలంలో పూర్తి స్థాయిలో పంపిణీ చేయలేదు. ఇవి ఎవరు ఇస్తారు.. ఎక్కడ ఉన్నాయి.. అనే సందేహాలతో లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి అందని వారికి కార్డులు పంపిణీ చేసేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

గాయపడిన చిన్నారులకు న్యాయం చేయాలి

ఉదయగిరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పసముద్రం గ్రామంలో వినాయక విగ్రహ నిమజ్జనోత్సవంలో బాణసంచా పేలి తీవ్రంగా గాయపడిన చిన్నారులకు న్యాయం చేయాలని ఆదివారం స్థానిక ఆర్ అండ్ బీ అతిథిగృహంలో జిల్లా యాదవ, బీసీ సంఘ ప్రతినిధులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాలిన గాయాలతో ఇప్పటికీ వైద్యశాలలో చిన్నారులు చికిత్స పొందుతున్నారన్నారు. గ్రామంలో సమగ్ర విచారణ జరిపి ఈ చర్యలకు ప్రేరేపించిన, పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. చిన్నారులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు వారికయ్యే వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యాదవ, బీసీ సంఘ నాయకులు కిశోర్, రమణయ్య, మధుసూదన్‌రావు, పద్మజ, మహేష్, రజని, శైలజ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

ఏఎస్‌పేట, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి సురేష్‌బాబు తెలిపారు. ఆదివారం ఆయన యూరియా అధికంగా వాడితే కలిగే నష్టాల గురించి రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణతో పాటు, ప్రజలకు ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు.

దెబ్బతిన్న ఆర్అండ్‌బి రహదారి అంచులు

● వాహనదారుల అవస్థలు



ప్రమాదకరంగా మారిన రహదారి అంచులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఆర్ అండ్ బీ రహదారుల అంచులు దెబ్బతిని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాలు ఎదురుగా వచ్చినా, ముందు వెళ్లే వాటిని క్రాస్ చేసే సమయంలోను ఒక్కసారిగా రోడ్డు దిగే క్రమంలో వాహనదారులు జారిపడి ప్రమాదాలు సంభవించిన సంఘటనలు అనేకం ఉన్నాయి. మండలంలోని పెద్దిరెడ్డి పల్లి, ధర్మవరం, నార్త్‌కొండాయపాళెం, విరువూరు తదితర గ్రామాల సమీపంలోని ప్రధాన రహదారి వెంట బాగా దెబ్బతిన్న అంచులే దారి పొడవునా దర్శనమిస్తుండడంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. పగలు ఎలాగోలా ప్రయాణాలు సాగించినప్పటికీ రాత్రి సమయాల్లో పరిస్థితి మరీ దారుణంగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

గ్రహణంతో ఆలయాల మూత



మూతపడిన సంగమేశ్వరాలయం

సంగం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని పలు ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం మూసివేశారు. రాత్రి చంద్రగ్రహణం ఏర్పడనుండడంతో సంగమేశ్వరాలయాన్ని మూసివేశారు. అదేవిధంగా వంగల్లులోని భీమేశ్వరాలయం, మర్రిపాడులోని చెన్నకేశవస్వామి, దువ్వూరులోని కోటేశ్వరస్వామి ఆలయాలను మూసివేశారు.

కాటేపల్లి పాఠశాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు

వింజమూరు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి హైస్కూల్‌కు ప్రహరీ లేక అపరిశుభ్రంగా తయారవడమే కాకుండా పశువులు పాఠశాలలోకి ప్రవేశిస్తున్నాయి. దీంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్న తరుణంలో నూతనంగా వచ్చిన ప్రధానోపాధ్యాయుడు ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, నైట్ వాచ్‌మెన్ ఆర్థిక సహాయంతో పాఠశాల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.

జాతీయ రహదారిపై హైమాస్ట్ వెలుగులు



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద కూడలిలో హైమాస్ట్ దీపాల వెలుగులు

ఉదయగిరి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీతారామపురం - ఉదయగిరి మార్గంలోని 167-బీజీ జాతీయ రహదారిపై హైమాస్ట్ దీపాల వెలుగులు విరజిమ్ముతున్నాయి. రహదారి కూడలి ప్రాంతాల్లో కొన్నినెలల కిందట విద్యుత్ దీపాల కోసం ఏర్పాటు చేసినా కనెక్షన్ ఇవ్వకపోవడంతో వాహనదారులు పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద హైమాస్ట్ దీపాలు వెలుగులు విరజిమ్మడంతో వాహనదారుల ఇబ్బందులు తొలిగాయి.